



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న అల్లూరి, అనకాపల్లి జిల్లా కలెక్టర్లు

నేటి నుంచి టెన్త్ పరీక్షలు

జిల్లాలో 107 కేంద్రాలు.. 22,042 మంది విద్యార్థులు

- పక్కాగా నిబంధనలు పాటించాలి
- పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలి
- ఎగ్జామ్స్ స్క్వాడ్, నిర్వహణ అధికారులకు డీఈవో అప్పారావు నాయుడు ఆదేశం



మాట్లాడుతున్న డీఈవో అప్పారావునాయుడు

అనకాపల్లి టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షల్లో నిబంధనలను పక్కాగా పాటించాల్సిందేనని డీఈవో అప్పారావునాయుడు స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక భీమునిగుమ్మం జీవీఎంసీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షల నిర్వహణ అధికారులు, స్క్వాడ్ బృందాల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 107 కేంద్రాల్లో జరిగే పరీక్షలకు 22,042 మంది విద్యార్థులు హాజరవుతాయన్నారు. జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా చర్యలు తప్పవన్నారు. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలన్నారు. సోమవారం నుంచి ప్రారంభంకానున్న పదవ తరగతి బోర్డు, ఓపెన్ స్కూల్ పబ్లిక్ పరీక్షల నిర్వహణలో నిబంధనలన్నీ పక్కాగా పాటించాల్సిందేనన్నారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా, ఏ రూపంలో ఎవరు భాగస్వాములు అయినా కఠిన చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. విద్యార్థులకు పరీక్షా ... మిగతా 6వ పేజీలో

హాల్ టికెట్లు ఆపితే చర్యలు తప్పవు

అనకాపల్లి రూరల్: ఫీజుల బకాయిల కారణాలతో విద్యార్థుల పదవ తరగతి పబ్లిక్ పరీక్షల హాల్ టికెట్లు నిలుపుదల చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏ విద్యా సంస్థ అయినా, నిర్వాహకులైనా విద్యార్థులు పరీక్షకు హాజరయ్యే అవకాశం లేకుండా వారి హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టినా, అటువంటి ఫిర్యాదులు వచ్చినా అటువంటి విద్యా సంస్థలపై కఠిన చర్యలు తప్పవన్నారు. తగిన విచారణ చేయించి ఆ పాఠశాల గుర్తింపును కూడా రద్దు చేస్తామన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

సీతాకోక చిలుకల కనువిందు

వన్యప్రాణి రక్షణ చట్టం పరిధిలో 27 జాతులు

ఐసీయూఎన్ గుర్తించినవి తొమ్మిది

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 190 రకాలు

- మనుగడపై వాతావరణ మార్పుల ప్రభావం
- అంతరించిపోయే దశలో కొన్ని జాతులు
- పదేళ్లపాటు అధ్యయనం చేసిన విశాఖ వాసి

విశాఖపట్నం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిలో అందమైన ప్రాణి సీతాకోక చిలుక. వివిధ రకాల వర్ణాలతో గుంపులుగా అవి చేసే సందడి కనుల విందు గొలుపుతుంది. తూర్పు కనుమల పరిధిలో ఎక్కువగా సందడిచేసే సీతాకోక చిలుకల్లో ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో 190 జాతులున్నాయని, ఇవి మొత్తం ఆరు కుటుంబాలకు చెందినవని విశాఖకు చెందిన పరిశోధకుడు శరగడం అప్పన్న గుర్తించారు. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో సుమారు పదేళ్లపాటు సుదీర్ఘంగా పర్యటించి సీతాకోక చిలుకలపై చేసిన అధ్యయనంతో ఇటీవల పరిశోధన పత్రం సమర్పించారు.



కామన్ జోకర్



బ్లూ క్రో

భారత ప్రభుత్వం 1972లో రూపొందించిన వన్యప్రాణి రక్షణ చట్టం పరిధిలో 27 రకాల సీతాకోక చిలుకలుండగా, మరో తొమ్మిది ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్) గుర్తించిన జాబితాలో ఉన్నాయి. మరొకటి కామన్ బర్డ్‌వింగ్ సైట్స్ అనుబంధం-2లో చేర్చారు. శరగడం అప్పన్న బీఎస్సీ చదువుకునే 2011-14 మధ్య కాలంలో జంతు ప్రదర్శనశాల సీతాకోక చిలుకల పార్కులో పని చేసే అవకాశం లభించింది. ఆ తరువాత పీజీలో చేరినా జూలో ఐదేళ్లపాటు సీతాకోక చిలుకల పార్కులో పనిచేయడంతో వాటితో ఏర్పడిన అనుబంధం పరిశోధనకు పురిగొల్పింది. ఫొటోగ్రఫీ చేస్తే డాక్యుమెంటరీకి ఉపయోగపడుతుందని భావించిన ఆయన ఏయూలో ఫొటోగ్రఫీ డిప్లమో చేసిన తరువాత 2017 నుంచి సీతాకోక చిలుకలపై అధ్యయనం ప్రారంభించారు. ఈ క్రమంలో విశాఖను ఆనుకుని ఉన్న కైలాసగిరి, కంబాలకొండ, సింహాచలం కొండ, ఇంకా చెట్లు, పొదలు ఉండే ప్రాంతాల్లో పర్యటించారు. ఆ తరువాత ఉమ్మడి జిల్లా పరిధిలోని దేవరాపల్లి, అరకులోయ, పాడేరు, చింతపల్లి, సీలేరు, జి.మాడుగుల, సప్పర్ల, లంబసింగి, వంట్లమామిడి, ఏజెన్సీకి ఆనుకుని ఉన్న మరిన్ని ప్రాంతాల్లో పర్యటించి సీతాకోక చిలుకల ఆవాసాలను దగ్గరగా పరిశీలించి వాటి సంతతి, జీవన విధానం, జాతుల వివరాలు సేకరించారు.



పీకాక్



శరగడం అప్పన్న, పరిశోధకుడు

ఆరు కుటుంబాలే...

ఉమ్మడి విశాఖ జిల్లాలో కేవలం ఆరు కుటుంబాలకు చెందిన 190 రకాల సీతాకోకచిలుకలు ఉన్నట్టు తన పరిశోధనలో అప్పన్న గుర్తించారు. వాటిలో 'నియంఫ్' కుటుంబానికి చెందిన సీతాకోక చిలుకలే ఎక్కువ. తరువాత 'లైకేనిడే', 'హెస్పెరిడే' (స్కిప్పర్), 'ఫైరిడైన్', 'పాపిలియోనిడే', 'రియోడినిడే' కుటుంబాలున్నాయి. ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ గుర్తించిన తొమ్మిది జాతులలో 'పీల్స్‌పామ్‌ఫ్లై' అనే జాతికి చెందిన సీతాకోకచిలుక అంతరించేపోయే దశలో ఉంది. తూర్పుకనుమలు, పశ్చిమ కనుమల మధ్య సారూప్యత కోసం చేస్తున్న అధ్యయనాల్లో సీతాకోక చిలుకలపై చేసిన పరిశోధన ఒకటిగా పేర్కొంటున్నారు. తూర్పు కనుమల్లో ప్రధానంగా పొరుగునున్న ఒడిశాకు ప్రత్యేకమైన స్థానిక జాతిగా పేర్కొంటున్న 'మార్బెల్డ్ మ్యాప్' ఉనికి అప్పన్న పరిశోధనలో ... మిగతా 6వ పేజీలో

సైకిల్‌పై సరదాగా..

విధుల్లో నిత్యం బిజీగా ఉండే అల్లూరి, అనకాపల్లి జిల్లా కలెక్టర్లు సైకిల్ తొక్కి సందడి

- ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని సూచన

అనకాపల్లి టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్లు కె.విజయకృష్ణన్, ఎస్.దినేశ్‌కుమార్‌లు ఆదివారం సైకిల్ తొక్కి సందడి చేశారు. అనకాపల్లి యోగా లైఫ్ సెంటర్ ఆధ్వర్యంలో తుమ్మపాల చినబాబుకాలనీ నుంచి అనకాపల్లి పట్టణం మీదుగా బొజ్జన్నకొండ వరకు ఐదు కిలోమీటర్ల మేర జరిగిన సైకిల్ ర్యాలీలో వారు పాల్గొని అందర్నీ ఉత్సాహపరిచారు. అనంతరం వారు మెట్ల మార్గంలో బొజ్జన్నకొండ ఎక్కారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం తప్పనిసరిగా చేయాలని సూచించారు. నిత్యం విధుల్లో బిజీగా ఉండే అల్లూరి, అనకాపల్లి జిల్లా కలెక్టర్లు దినేశ్‌కుమార్, విజయకృష్ణన్‌లు దంపతులు కావడం, ఈ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొనడం విశేషం. ఈ కార్యక్రమంలో యోగా లైఫ్ సెంటర్ ఫౌండర్ కరణం బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి



జిల్లా పోలీస్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఎస్పీ శ్రావణి

జిల్లాలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎస్పీ శ్రావణి, అనకాపల్లి టౌన్ ఇన్‌స్పెక్టర్ టీవీ విజయ్ కుమార్, ఎస్ఐ సురేంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు. - అనకాపల్లి రూరల్

బైక్ విన్యాసాలతో అలజడి

కళాశాలల వద్ద యువకుల హల్‌చల్

- ప్రధాన రహదారిపై రెచ్చిపోతున్న వైనం
- ఎప్పుడు ఏం జరుగుతుందోనని భీతిల్లుతున్న విద్యార్థినులు, స్థానికులు



విన్యాసాల అనంతరం బైక్‌పై నలుగురు యువకులు వెళుతున్న దృశ్యం

చోడవరం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారిపై మధ్యాహ్నం 12.30 గంటలైతే చాలు యువకుల బైక్ విన్యాసాలు ప్రారంభమవుతాయి. మోటార్ బైక్‌పై ముగ్గురు, నలుగురు కూర్చొని విపరీతమైన స్పీడుతో ఎక్స్‌లేటర్ రైజ్ చేస్తూ హడావిడి సృష్టిస్తున్నారు. దీంతో ఏం జరుగుతుందోనని ఇతర వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు.



కళాశాలల జంక్షన్ వద్ద బైక్‌పై ముగ్గురు యువకులు వెళుతున్న దృశ్యం

ఇప్పటి వరకు నగరాలకే పరిమితమైన బైక్‌ల విన్యాసాలు ఇప్పుడు గ్రామీణ ప్రాంతంలోనూ కనిపిస్తున్నాయి. గత కొంత కాలంగా స్థానిక కాలేజీ జంక్షన్ వద్ద యువకులు మోటార్ బైక్ విన్యాసాలతో రెచ్చిపోతున్నారు. ఒకే ప్రాంతంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీ, పాలిటెక్నిక్ కాలేజీ, ప్రభుత్వ హైస్కూల్స్ ఉన్నాయి. మధ్యాహ్నం భోజన సమయంలో ఇంచుమించుగా ఇవన్నీ ఒకే సమయంలో లంచ్ అవర్ ఇస్తుండడంతో విద్యార్థులు, విద్యార్థినులంతా ఒక్కసారిగా రోడ్డుపైకి వస్తుంటారు. ఈ సమయంలోనే యువకులు తమ విన్యాసాలు ప్రారంభిస్తున్నారు. ఇక సాయంత్రం కాలేజీ వదిలే సమయంలో సైతం ఇదే తంతు కొనసాగుతున్నది. మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో ప్రధాన రహదారిపై వీరి బైక్ విన్యాసాలతో స్థానికులు ఆందోళన ... మిగతా 6వ పేజీలో

బొర్రా గుహల అభివృద్ధికి అవరోధాలు

రూ.24.09 కోట్ల పనులు చేపట్టేందుకు ముందుకు రాని బిడ్డర్లు

- గత వైసీపీ ప్రభుత్వంలో బిల్లులు అందక ఇబ్బందులు
- కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టే పనులైనా అనాసక్తి
- కూటమి ప్రభుత్వం వచ్చినా పనులకు కలగని మోక్షం
- మరోసారి టెండర్లు ఆహ్వానించిన ఏపీటీడీసీ



(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి) బొర్రా గుహల అభివృద్ధికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. గత వైసీపీ హయాంలో పనులు చేసినా బిల్లులు అందకపోవడంతో కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టనున్న పనులైనప్పటికీ ఎవరూ ఉత్సాహం చూపించ లేదు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా ఇప్పటికీ ఈ పనులకు మోక్షం కలగడం లేదు. దీంతో బొర్రా కేవ్స్ ఎక్స్‌పీరియన్స్ పేరుతో చేపట్టనున్న అభివృద్ధి పనులు బ్యాడ్ ఎక్స్‌పీరియన్స్ మిగులుస్తున్నాయి.

అనంతగిరి మండలంలోని బొర్రా గుహలను అభివృద్ధి చేయడానికి అధికారులు టెండర్లు పిలిస్తే పనులు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. గత ఏడాది కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ 2.౦ కింద రూ.30 కోట్లు మంజూరు చేసింది. అందులో రూ.24.09 కోట్లతో బొర్రా గుహలను వివిధ రకాలుగా అభివృద్ధి చేయడానికి ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ప్రణాళిక రూపొందించింది. సెప్టెంబరు 2024లో రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్‌తో రావాలని బిడ్డర్లను ఆహ్వానించింది. దానికి 'బొర్రా కేవ్స్ ఎక్స్‌పీరియన్స్' అని పేరు పెట్టింది. అయితే అంతకుముందు ప్రభుత్వంలో పర్యాటక శాఖ చేపట్టిన ప్రాజెక్టులకు సకాలంలో నిధులు ఇవ్వకపోవడంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో అనేకం మధ్యలోనే నిలిచిపోయాయి. ఇందులో లంబసింగిలో కాటేజీలు, విశాఖ నగరంలో అప్పుఘర్ యాత్రీ నివాస్, అరకులో మరికొన్ని ఆ జాబితాలో ఉన్నాయి. కాంట్రాక్టర్లు ముందు డబ్బులు పెట్టి పనులు చేసినా, నిధులు విడుదల చేయడంలో ప్రభుత్వం అలసత్వం ప్రదర్శించింది. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా పాతవాటిని పూర్తి చేయడంపై దృష్టి సారించలేదు. దాంతో కొత్త ప్రాజెక్టులను చేపడితే ఇరుక్కుపోతామనే భావనతో ఎవరూ ఆసక్తి చూపించడం లేదని సమాచారం. దాంతో ఏపీటీడీసీ మరోసారి బిడ్డర్లు ముందుకు రావాలని గత శుక్రవారం ప్రకటన జారీ చేసింది.

ఏమి చేయాలనుకుంటున్నారంటే..?

బొర్రా గుహలకు రోజూ వేల సంఖ్యలో వచ్చే పర్యాటకులకు సరైన ప్రయాణ, పార్కింగ్, వసతి సౌకర్యాలు లేవు. వీటి కోసం 5.89 ఎకరాల స్థలంలో రూ.24 కోట్లతో పనులు ... మిగతా 6వ పేజీలో

ట్రావెల్స్ బస్సు నుంచి మంటలు

- వెనుక వస్తున్న వాహనచోదకులు అప్రమత్తం చేయడంతో తప్పిన ప్రమాదం
- విశాఖ నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న బస్సు
- భయంతో బయటకు పరుగులు తీసిన 36 మంది ప్రయాణికులు
- చీకట్లోనే పడిగాపులు



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

- 6లో

గోవాడలో మళ్లీ ఆగిన క్రషింగ్

- నాలుగు రోజుల వ్యవధిలో రెండు సార్లు అంతరాయం



క్రషింగ్ నిలిచిపోవడంతో యార్డులో ఉన్న చెరకు బండ్లు

చోడవరం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో క్రషింగ్ మరోసారి నిలిచిపోయింది. క్రషింగ్‌కు అవసరమైన ప్రెజర్ అందకపోవడంతో శనివారం అర్ధరాత్రి క్రషింగ్ నిలిచిపోయింది. నాలుగు రోజుల వ్యవధిలో ఫ్యాక్టరీ రెండు సార్లు ప్రక్రియ నిలిచిపోవడం గమనార్హం.

ఫ్యాక్టరీలోని టర్బయిన్‌లో తలెత్తిన సాంకేతిక లోపంతో ఈ నెల 12వ తేదీ తెల్లవారుజామున క్రషింగ్ నిలిచిపోయిన సంగతి తెలిసిందే. టర్బయిన్ మరమ్మతు పనులు చేపట్టిన యాజమాన్యం శుక్రవారం తెల్లవారుజామునకు సిద్ధం చేయగా, తిరిగి ప్లాంట్‌లో తలెత్తిన సాంకేతిక కారణాలతో శనివారం అర్ధరాత్రి నుంచి మరోసారి క్రషింగ్‌నకు బ్రేక్ పడింది. సీజన్ ప్రారంభం నుంచి వరుసగా ఒకదాని వెంట మరొకటిగా అవాంతరాలు తలెత్తుండడం, క్రషింగ్ ఆగుతూ నడుస్తూ ఉండడం సర్వసాధారణంగా మారిపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నాలుగు రోజుల వ్యవధిలో రెండు సార్లు క్రషింగ్ నిలిచిపోవడంతో అసలు ఈ సీజన్ సక్రమంగా పూర్తవుతుందా? అనే సందేహం రైతాంగంలో వ్యక్తమవుతోంది. క్రషింగ్ నిలిచిపోవడంతో రైతుల్లో అసహనం అంతకంతకు పెరిగిపోతున్నది. వరుస అంతరాయాలతో ఇటు యాజమాన్యానికి, అటు కార్మికులకు కూడా దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. కాటాల వద్ద, ఫ్యాక్టరీ వద్ద వందలాది చెరకు బండ్లు ఎండకు ఎండిపోతుండడం, ఇంకా ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేయడానికి రైతులు పర్మిట్ల కోసం తిరుగుతుండడంతో అధికారులకు ఏం చేయాలో పాలుపోని పరిస్థితి నెలకొంది. మరో వంక తరచూ అంతరాయాలతో క్రషింగ్ నిలిచిపోతుండడంతో రైతుల ఆందోళనలతో గోవాడ వద్ద పరిస్థితి ఎప్పుడు ఏ విధంగా మారుతుందో తెలియక పోలీసు అధికారులు సైతం ఫ్యాక్టరీ క్రషింగ్ తీరుతెన్నులను సమీక్షిస్తున్నారు.

నేటి నుంచి టెన్త్ పరీక్షలు

... 5వ పేజీ తరువాయి

కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. హాల్ టికెట్లను ముందుగా తనిఖీ చేసి విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు, పరీక్షల విభాగం సహాయ సంచాలకులు ఎ.శ్రీధర్‌రెడ్డి, విద్యాశాఖ, రెవెన్యూ, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా పదవ తరగతి రాష్ట్రస్థాయి పరిశీలకుడు పి.శ్రీనివాసరావు స్క్వాడ్‌లు, సెంటర్ కస్టోడియన్‌లతో సమావేశం నిర్వహించారు. అలాగే ఎంఈవోలు, ప్రధానశాఖ అధికారులు, ప్రధాన సూపరింటెండెంట్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పరీక్షలు సజావుగా నిర్వహించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు.

పటిష్ఠ బందోబస్తు

అనకాపల్లి రూరల్: పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభంకానున్న నేపథ్యంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్పీ తుహిన్‌సిన్హా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు ఉదయం తొమ్మిది గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, పరీక్ష పూర్తయ్యే వరకు కేంద్రం నుంచి బయటకు వెళ్లడానికి అనుమతి లేదన్నారు. హాల్లోకి చీఫ్ సూపరింటెండెంట్ తప్ప ఎవరూ మొబైల్ ఫోన్ తీసుకురావద్దని సూచించారు. విద్యార్థులు హాల్ టికెట్ తప్పనిసరిగా తీసుకురావాలని, సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, సమీపంలోని జెరాక్స్, ఇంటర్నెట్ షాపులు మూసివేయాలని ఆదేశించినట్టు ఆయన పేర్కొన్నారు.

బైక్ విన్యాసాలతో అలజడి

... 5వ పేజీ తరువాయి

చెందుతున్నారు. దాదాపుగా విద్యా సంస్థలన్నీ సమీపంలోనే ఉండడంతో కాలేజీ జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇదే సమయంలో బైక్‌ల విన్యాసాలు చేస్తుండడం అందరినీ కలవరపాటుకు గురిచేస్తున్నది. గతంలో స్పీడుగా వాహనాలు నడిపే యువకులను పోలీసులు స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పరిస్థితి కాస్త సద్దుమణిగినా, మళ్లీ ఇటీవల కాలంలో యథావిధిగా బైక్‌ల దూకుడు పెరిగిపోయింది. పోలీసులు మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో ఈ పాయింట్ వద్ద ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి వాహనాలు నడిపే విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తే తప్ప పరిస్థితిలో మార్పువచ్చే అవకాశాలు కనిపించడం లేదు. ఒకే బైక్‌పై ముగ్గురు, నలుగురు కూర్చోవడం, వేగంగా వెళుతుండడం వల్ల ప్రమాదం జరిగితే వాహనంపై ఉన్నవారితో పాటు రోడ్డుపై వెళ్లేవారు తీవ్రంగా గాయపడే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. పోలీసు అధికారులు స్పందించి యువకులు బైక్‌ల విన్యాసాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు. .

బొర్రా గుహల అభివృద్ధికి అవరోధాలు

... 5వ పేజీ తరువాయి

చేపట్టాలని ఏపీటీడీసీ ప్రణాళిక రూపొందించింది. అందులో రెండు ఎకరాలు పార్కింగ్‌కు కేటాయించారు. బొర్రా గుహలకు వచ్చే మార్గంలో అందమైన స్వాగత ద్వారం, గుహల వద్ద మరో ద్వారం ఏర్పాటు చేయాలని డిజైన్లు సిద్ధం చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎలక్ట్రిక్ చార్జింగ్ వాహనాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రతిపాదించారు. ప్రధాన మార్గం నుంచి గుహల వరకు వాటినే నడపాలని నిర్ణయించారు. పర్యాటకుల కోసం టాయిలెట్లు, లగేజీ భద్రపరచుకునే గదులు తదితరాలు అందులో ఉన్నాయి. స్థానిక గిరిజనులు తయారుచేసిన కళాకృతులు, పండించిన ఆర్గానిక్ ఉత్పత్తులను విక్రయించుకోవడానికి మార్కెట్ ప్లాన్ చేశారు. గుహలకు వెళ్లే మార్గంలో రెండు వైపులా ఫుట్‌పాత్‌లు, లోయల అందాలను తిలకించేందుకు వ్యూ పాయింట్లు, విజువల్ డెక్‌లకు స్థలాలు ఎంపిక చేశారు. ఎంటర్‌టెయిన్‌మెంట్ కోసం ఎడ్వెంచర్ స్పోర్ట్స్, ఎగ్జిబిషన్ నిర్వహించాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. గుహ లోపలి అందాలను విభిన్న కోణాల్లో చూపించడానికి సౌండ్ అండ్ లైటింగ్ సిస్టమ్‌ను ప్లాన్ చేశారు. ఇది మంచి ప్రాజెక్ట్ అయినప్పటికీ పర్యాటక శాఖ నిధులు మంజూరుకు ముందుకు రాకపోవడంతో ఆసక్తి ఉన్నప్పటికీ కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదనే వాదన వినిపిస్తోంది. ప్రభుత్వం వారికి నమ్మకం కలిగేలా హామీ ఇస్తే తప్ప కొత్త ప్రాజెక్టులు పట్టాలపైకి వచ్చే అవకాశం లేదనే వాదన వినిపిస్తోంది.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఉదయం 9.30 గంటల నుంచి ఆరంభం

కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

ఎలమంచిలి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పదో తరగతి పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం నుంచి పట్టణంలో నాలుగు కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. ఈ కేంద్రాల్లో ఫర్నీచర్, విద్యుత్, తాగునీటి సదుపాయాలను కల్పించారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయన్నారు. కొత్తపేట జెడ్పీ హైస్కూలులో 337 మంది విద్యార్థులు, తులసీనగర్‌లోని బాలికోన్నత పాఠశాలలో 167 మంది, శ్రీచైతన్య స్కూలులో 322 మంది, సెయింట్ మేరీస్ స్కూలులో 332 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు.

పాయకరావుపేటలో..

మండలంలో సోమవారం నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలను 1,468 మంది విద్యార్థులు రాయనున్నారు. వీరిలో 1,237 మంది రెగ్యులర్, 163 ప్రైవేటు, 68 మంది ఒకేషల్ విద్యార్థులున్నారని ఎంఈవో కేఎన్.గాంధీ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జడ్పీ బాలికోన్నత పాఠశాల, శ్రీప్రకాష్, శ్రీచైతన్య టెక్నో, కనోసా పబ్లిక్ స్కూల్‌తోపాటు మండలంలో ఎస్.నర్సాపురం, పాల్తేరు జడ్పీ హైస్కూల్‌ల్లో పరీక్షలు జరగనున్నాయని చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.



ఎలమంచిలి బాలికల పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

రాంబిల్లిలో..

మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. రాంబిల్లిలో 232 మంది విద్యార్థులు, రవీంద్ర స్కూల్‌లో 126 మంది, దిమిలిలో 112 మంది, పంచదార్లలో 176 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్టు ఎంఈవోలు సూర్యారావు, సూర్యనారాయణ తెలిపారు.

మునగపాకలో..

మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 596 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ఎంఈవో వేణుగోపాలరావు తెలిపారు. మునగపాక, నాగులాపల్లి, గణపర్తి జడ్పీ హైస్కూల్‌తోపాటు స్థానిక శ్రీప్రగతి స్కూల్‌ల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 483మంది, ప్రైవేటు స్కూళ్లకు చెందిన 113మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

కోటవురట్లలో..

కోటవురట్లలో పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు చేసినట్టు ఎంఈవోలు రామారావు, జోషి తెలిపారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో 231 మంది, బాలికల ఉన్నత పాఠశాలలో 152 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్టు చెప్పారు. అలాగే పాములవాక జడ్పీ హైస్కూల్‌కు చెందిన 78 మంది విద్యార్థులు నర్సీపట్నం మండలం వేములపూడి హైస్కూల్, మోడల్ స్కూల్‌ల్లో పరీక్షలు రాయనున్నారని వారు చెప్పారు.

ఎస్.రాయవరంలో..

మండలంలోని ఎస్.రాయవరం, ధర్మవరం అగ్రహారం, దార్లపూడి, కొరుప్రోలు హైస్కూళ్లతోపాటు తిమ్మాపురంలోని శ్రీఆదర్శ పాఠశాలలో పదో తరగతి పరీక్షలు జరగనున్నట్టు డిప్యూటీ డీఈవో పి.అప్పారావు తెలిపారు. ఈ కేంద్రాల్లో 910 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్టు సీఐ రామకృష్ణ తెలిపారు.

నక్కపల్లిలో..

మండలంలోని ఐదు కేంద్రాల్లో టెన్త్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఎంఈవో కె.నరేశ్ చెప్పారు. నక్కపల్లి, వేంపాడు, గొడిచెర్లలోని ఐదు కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్నట్టు చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు వంటి సదుపాయాలు కల్పించారన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎల్‌ఐసీ ఏజెంట్ మృతి

» న్యాయం చేయాలంటూ రోడ్డుపై కుటుంబీకుల ఆందోళన

మునగపాక, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మునగపాక జంక్షన్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన ఎల్‌ఐసీ ఏజెంట్ మాడా కన్నారావు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక ఎస్‌ఐ పి.ప్రసాదరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం ఉదయం కన్నారావు తన స్వగృహం నుంచి స్కూటీపై మార్కెట్‌కు వస్తుండగా అచ్యుతాపురం నుంచి అనకాపల్లి వైపు వెళ్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో లారీ ముందు చక్రం కింద పడి కన్నారావు మృతి చెందాడు. అతని భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ప్రసాదరావు తెలిపారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. కన్నారావుకు ఇద్దరు భార్యలు, ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

ఘటనా స్థలం వద్ద ఉద్రిక్త పరిస్థితులు

ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న భార్య, బిడ్డలతోపాటు స్థానికులు పెద్ద ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకున్నారు. భార్యబిడ్డలు కన్నీరుమున్నీరై విలపించారు. న్యాయం చేయాలంటూ మృతదేహాన్ని తరలించనివ్వకుండా కుటుంబీకులు, బంధువులు ఆందోళనకు దిగారు. స్థానికులు సంఘీభావం ప్రకటించారు. భారీ వాహనాల కారణంగా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని మొర పెట్టుకుంటున్నా అధికార యంత్రాంగం పట్టించుకోలేదని స్థానికులు ఆరోపించారు. రోడ్డు విస్తరణ జరిగే వరకు భారీ వాహనాల రాకపోకలు నిరోధించాలని డిమాండ్ చేశారు. కశింకోట సీఐ అల్లు స్వామినాయుడు, అచ్యుతాపురం ఎస్‌ఐ ఎం.వెంకటరావు, ఎలమంచిలి ట్రాఫిక్ ఎస్‌ఐ బి.రామకృష్ణ మృతుడి కుటుంబీకులు, స్థానికులతో చర్చించారు. ప్రజల డిమాండ్‌లను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళతామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనకారులు శాంతించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఆసుపత్రికి తరలించారు. అక్కడ పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సాయంత్రం మునగపాకలో అంత్యక్రియలు పూర్తి చేశారు.



ఎల్‌ఐసీ ఏజెంట్ కన్నారావు మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబీకులు (ఇన్‌సెట్‌లో) కన్నారావు(ఫైల్)

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

ఎలమంచిలి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర అవతరణకు అమరజీవి పొట్టి శ్రీరాములు అందించిన సేవలు మరువలేనివని మునిసిపల్ వైస్ చైర్మన్ ఆరెపు నాగ త్రినాథ గుప్తా అన్నారు. ఆదివారం పట్టణంలోని దిమిలి రోడ్డు జంక్షన్ వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం, వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వక్తలంతా పొట్టి శ్రీరాముల సేవలను కొనియాడారు. నేటి యువత ఆయన అడుగు జాడల్లో పయనించాలని కోరారు. కార్యక్రమంలో భద్రం, రాజేశ్, రూప, లక్ష్మి, రమా ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

పొట్టి శ్రీరాములు జయంతిని స్థానిక గ్రంథాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి. కోటేశ్వరరావు, ఎంవీ రమణ, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు



ఎలమంచిలిలో పొట్టి శ్రీరాములుకు నివాళులర్పించిన మునిసిపల్ వైస్ చైర్మన్ గుప్తా, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

'దర్జీలకు సంక్షేమ పథకాలు అందించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ

ఎలమంచిలి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రెడీమేడ్ రాకతో దర్జీల జీవనాధారం కష్టంగా మారిందని, దర్జీలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించాలని న్యూ నవ్యాంధ్ర రాష్ట్ర టైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అతికినశెట్టి సత్యనానారాయణ కోరారు. ఆదివారం స్థానిక పీవీ కాంప్లెక్సు ఆవరణలో జరిగిన మండల టైలర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో రెడీమేడ్ వస్త్రాలు తక్కువ ధరకు అందుబాటులో ఉండడంతో దర్జీల వృత్తికి ఆదరణ కొరవడుతుందన్నారు. ఇదే వృత్తిలో చాలీచాలని ఆదాయంతో తమ కుటుంబాలను నెట్టుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంఘాధ్యక్షుడు వియ్యపు సత్యనారాయణ మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికుల కోసం ప్రవేశపెట్టిన ఈ శ్రమ్ పథకాన్ని టైలర్లు అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా దవళేశ్వరపు సూరిబాబు, సంఘాధ్యక్షుడిగా వియ్యపు సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలిగా వేగి విజయ, ప్రధాన కార్యదర్శి దుప్పట్ల శేషుబాబు, ఉపాధ్యక్షుడిగా పిల్లా శివ, సహాయకార్యదర్శిగా గిడుతూరి అప్పారావు, కోశాధికారిగా కట్టా సత్యనారాయణ, సలహాదారులుగా మళ్ల శ్రీనివాస్, ప్రతినిధులుగా కె.బాదరరావు, వి.సత్తిబాబు, వై.నాయుడు, పసగడుగుల రమణలను ఎన్నుకున్నారు.

ఎంపీపీగా అప్పలరాజు బాధ్యతలు స్వీకరణ

ఎస్.రాయవరం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ (ఎంపీపీ)గా చోడిపల్లి అప్పలరాజు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అప్పలరాజును వైస్ ఎంపీపీ-1 బొలిశెట్టి గోవిందరాజు, జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి, మాజీ ఎంపీపీ కోన లోవలక్ష్మి తదితరులు సన్మానించారు. అనంతరం మండల సమస్యలకు సంబంధించిన పలు విషయాలపై అప్పలరాజు చర్చించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు బాలం సూరిబాబు, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీపీ బాధ్యతలు చేపట్టిన అప్పలరాజును సన్మానిస్తున్న వైస్ ఎంపీపీ గోవిందరావు తదితరులు

సీతాకోక చిలుకల కనువిందు

... 5వ పేజీ తరువాయి

వెల్లడైంది. ఈ పరిశోధనలో భూషల వెంకటరమణ, సూరిశెట్టి రవిబాబు భాగస్వాములయ్యారు.

వాతావరణ మార్పుల ప్రభావం

వాతావరణ మార్పులకు గురైన అనేక జాతుల జాబితాలో సీతాకోకచిలుకలు చేరాయి. వృక్షసంపద, సమశీతోష్ణస్థితి పరిస్థితులు వాటి జీవనానికి దోహదపడతాయి. అయితే చెట్లు నరికేయడం, శరవేగంగా మానవ ఆవాసాలు విస్తరించడం, వర్షాలు తగ్గడం, వేడి వాతావరణం నెలకొనడం వంటి ప్రతికూల పరిస్థితులు సీతాకోక చిలుకల ఉనికిపై ప్రభావం చూపుతున్నాయి. కంబాలకొండ, జూ, కైలాసగిరి, యారాడ కొండ పరిసరాల్లో గుంపులుగా సంచరించే సీతాకోకచిలుకలు ఇప్పుడు బాగా తగ్గిపోయాయి. సమూహంగా పయనించడం వీటి ప్రత్యేకత. కేవలం 20 రోజులు మాత్రమే జీవించే సీతాకోక చిలుక ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి నిత్యం వలస పోతుంటాయి. మధ్యలో కొన్ని రకాల ఔషధమొక్కలు, గుబురుగా ఉండే మొక్కలపై గుడ్లు పెడతాయి. విశాఖ నుంచి ఒడిశా వరకు సీతాకోక చిలుకలకు ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. అయితే ప్రస్తుతం వాతావరణంలో మార్పుల నేపథ్యంలో వాటి ఉనికి ప్రమాదంలో పడింది.

ట్రావెల్స్ బస్సు నుంచి మంటలు

ఎస్. రాయవరం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు 36 మంది ప్రయాణికులతో వెళుతున్న వీఆర్ఎల్ ట్రావెల్స్ బస్సు నుంచి ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో మంటలు వ్యాపించాయి. అటుగా వెళుతున్న వాహనచోదకులు డ్రైవర్‌ను అప్రమత్తం చేయడంతో పెనుప్రమాదం తప్పింది. మండలంలోని గెడ్డపాలెం జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై ఈ సంఘటన జరిగింది. డ్రైవర్ బస్సును రోడ్డు పక్కన నిలపడంతో ప్రయాణికులు భయంతో బయటకు పరుగులు తీశారు. బస్సు వెనుక భాగంలో ఉన్న చక్రాల నుంచి మంటలు రావడంతో వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వెనుక చక్రాల డ్రమ్ము పట్టేయడంతో మంటలు వ్యాపించాయని డ్రైవర్ తెలిపాడు. మరో బస్సులో తమను తరలించాలని డ్రైవర్‌ను ప్రయాణికులు కోరారు. అయితే తానేమీ చేయలేనని డ్రైవర్ చెప్పడంతో అసహనం వ్యక్తం చేశారు. బస్సులో 36 మంది ప్రయాణికులు ఉండగా, వీరిలో సగం మంది మహిళలు ఉన్నారు. వీరంతా చీకట్లో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటల వరకు వేచి ఉన్నారు.



చీకట్లో వేచి ఉన్న ప్రయాణికులు

పుష్పశోభితుడు..ఉపమాక వేంకటేశ్వరుడు

నక్కపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఉపమాక క్షేత్రంలో శ్రీవారి వార్షిక కల్యాణోత్సవాలు సందర్భంగా శనివారం రాత్రి నుంచి స్వామివారి పుష్పయాగోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అద్దాల మండపంలో వున్న స్వామివారి ఊయలను పలు రకాల పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించారు. ఆదివారం సాయంత్రం వరకూ అనేక మంది భక్తులు పుష్పశోభితుడైన వెంకన్నను దర్శించుకున్న భక్తులు పులకించిపోయారు. సోమవారం రాత్రి వరకూ పుష్పయాగోత్సవాలు జరుగుతాయి. ప్రత్యేక పూజలు అనంతరం ఆలయ అర్చకులు, వైష్ణవ స్వాములు ఆలయ గర్భగుడిలో పల్లకీతో ప్రాకార సేవ చేశారు. సోమవారం రాత్రితో వేంకన్న వార్షిక కల్యాణోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు చెప్పారు.



అద్దాల మండపంలో ఊయలలో శ్రీవారు (ఇన్‌సెట్‌లో) కల్యాణ వేంకటేశ్వరుడు

గూడుపమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

నక్కపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాక గూడుపమ్మ ఆలయాన్ని ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తారు. ఈ ఆలయాన్ని శక్తి కేంద్రంగా ఇటీవల మార్పు చేశారు. గూడుపమ్మను దర్శించుకోవడానికి అనేక ప్రాంతాల నుంచి భక్తులు రేబాక తరలివచ్చారు. ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీహరి రాజు ఆధ్వర్యంలో భక్తుల కోసం ఏర్పాట్లు చేశారు. భక్తుల గోత్రనామాలతో ఆలయంలో పూజలు నిర్వహించారు.



గూడుపమ్మని దర్శించుకుంటున్న భక్తులు

ఘనంగా కొత్త అమావాస్య పూజలు ప్రారంభం

పాయకరావుపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కంటోన్మెంట్ ఏరియాలో ఉన్న నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో కొత్త అమావాస్య పూజలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తెల్లవారు జాము నుంచి అధిక సంఖ్యలో మహిళలు పూజలు నిర్వహించారు. ఇప్పటికే అమ్మవారి గరగల సంబరాన్ని ప్రతి రోజూ పట్టణ వీధుల్లో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు పెదిరెడ్డి వెంకటసూర్యనారాయణ, నారపురెడ్డి పద్మావతి మాట్లాడుతూ ఈనెల 28వ తేది రాత్రి జాతర, 29న కొత్త అమావాస్య పండుగ అత్యంత వేడుకగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన

నక్కపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకయ్యపేటలో వేంపాడు వికాస తరంగణి ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు గర్భాశయ రొమ్ము క్యాన్సర్‌పై అవగాహనా సదస్సు నిర్వహించారు. అనేక మంది మహిళలకు గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. వికాస తరంగణి సభ్యులు చిక్కాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటి వరకూ 1,440 శిబిరాలు నిర్వహించామని చెప్పారు. డాక్టర్ గూటూరు తేజ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది మహిళలకు పరీక్షలు చేశారు. విశాఖ ఆరోగ్య వికాస్ సభ్యులు కుసుమ కుమారి, పద్మజ, హైమ, సుజాత,సుభాశ్ పాల్గొన్నారు.

ఘనంగా జనసేన జెండా ఆవిష్కరణ

ఎస్.రాయవరం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెట్టుగోళ్లపల్లిలో ఆదివారం స్థానిక జనసైనికుల ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జన సేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జోరుగా జనసేన జెండాలు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు.కార్యక్రమంలో జనసైనికులు పాల్గొన్నారు.



జనసేన జెండా ఆవిష్కరించిన దృశ్యం

బోయిలమ్మ ఆలయం ప్రారంభం

అచ్యుతాపురం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలాపల్లిలో బోయిలమ్మ అమ్మవారి నూతన ఆలయాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఆదివారం ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నేతలు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడు

» జడ్పీ మాజీ చైర్‌పర్సన్ భవానీ భాస్కర్


అచ్యుతాపురం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్ ఉన్న నాయకుడని, ఆయన మార్గదర్శకంలో నాయకులు, కార్యకర్తలు నడిచి నియోజకవర్గంలో టీడీపీ ఆధిపత్యాన్ని నిరూపించాలని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ భాస్కర్ అన్నారు. ఆదివారం అచ్యుతాపురంలో జరిగిన రాంబిల్లి మండల టీడీపీ శ్రేణుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడిన వారికి సముచిత స్థానం లభిస్తుందన్నారు. అంతకుముందు దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దూళి రంగనాయకులు, దిన్‌బాబు, ఏపీఎం సత్యనారాయణ, సేనాపతి నాగేశ్వరరావు, లాలం తాతబాబు, రవిరాజు, అజయ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భవానీ భాస్కర్

'సారా నియంత్రణకు అందరూ సహకరించాలి'

పాయకరావుపేట రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సారా రహిత ఆంధ్రప్రదేశ్ కోసం ప్రభుత్వం చేపట్టిన నవోదయం 2.0 కార్యక్రమానికి అందరు సహకరించాలని స్థానిక ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ జి.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండలంలో పెంటకోట గ్రామంలో సారా సేవించడం వలన కలిగే నష్టాలను తెలియజేస్తూ కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సారా తయారీ, రవాణా, అమ్మకాలు చట్టరీత్యా నేరమన్నారు. ఎక్సైజ్ సిబ్బంది కె.నాయుడుబాబు, బి.రమణ, ఎన్.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



కళాజాత నిర్వహిస్తున్న దృశ్యం


సీతారాములు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్న దంపతులు

ఉగాది పండుగ వైభవంగా జరుపుకోండి

» స్పీకర్ అయ్యన్నపాత్రుడు పిలుపు

నర్సీపట్నం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగను వైభవంగా జరుపుకోవాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. పెదబొడ్డేపల్లి రామాలయంలో శనివారం రాత్రి జరిగిన సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 ఏళ్ల క్రితం తమ పూర్వీకులు నిర్మించిన రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ చేయడం ఆనందంగా ఉందన్నారు. పాకలపాడు గురువు ఇక్కడి ఆలయంలో పూజలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. రానురాను పండుగలు కనుమరుగవుతున్నాయని, ఉగాది ప్రాముఖ్యతను యువత తెలుసుకోవాలని కోరారు. నియోజకవర్గంలోని అన్ని పంచాయతీలలో ఉగాది సందర్భంగా పంచాగ శ్రావణం, ఉగాది పచ్చడి ఏర్పాటు చేసుకొని పండుగ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాజునాయుడు, టీడీపీ నాయకుడు రెడ్డప్పలనాయుడు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె విజయోత్సవ సభ

నర్సీపట్నం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు విజయోత్సవ సభను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మెయిన్ రోడ్డులో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం సిటీ క్లబ్ ఆవరణలో పీఆర్‌టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్ గాదెను సత్కరించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారుల విచిత్ర వేషధారణ, నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంఘ నేతలు ఎ.వరహాలనాయుడు, జీవీ.రమేశ్, కె.రమణ, సుగుణ, బాబీ పాల్గొన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి


శ్రీరాముల విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

నర్సీపట్నం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఆంధ్ర కోసం పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం మరువలేమని వాసవీ క్లబ్ రీజనల్ చైర్మన్ వెలగా నారాయణ రావు అన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాదచారుల కోసం చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జాలమూరి బంగార్రాజు, బంగారు శెట్టి, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

పప్పుశెట్టిపాలెంలో పూడికతీత పనులు


కాలువల్లో పూడిక తొలగిస్తున్న కార్మికుడు

గొలుగొండ మార్చి, 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పప్పుశెట్టిపాలెం గ్రామంలో శనివారం పూడికతీత పనులు చేపట్టారు. పేరుకుపోయిన పూడికపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు గ్రామంలోని కాలువల్లో పూడికతీత పనులు చేశారు. అలాగే డ్రైనేజీల ద్వారా మురుగునీటి నిల్వలు లేకుండా తగిన చర్యలు చేపట్టారు.

అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేం

రావికమతం, మార్చి 16, (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఆదివారం మండలంలో కొత్తకోట ఆర్యవైశ్యులు ఘనంగా నిర్వహించారు. శాఖా గ్రంథాలయం వద్ద ఉన్న విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం షిర్డి సాయిబాబా ఆలయం వద్ద ఆర్యవైశ్య సంఘ ప్రతి నిధులు చలివేంద్రాన్ని ప్రారంభించారు.ఈసందర్భంగా ఉపాధ్యాయుని ననాగజ్యోతి మాట్లాడుతూ, ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు అమరజీవి అన్నారు. కార్యక్రమంలో వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు పి. శోభారాణి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాల భవన నిర్మాణం చేపట్టాలి

రోలుగుంట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదపేట గిరిజన గ్రామంలో శిథిలావస్థకు చేరిన ప్రాథమిక పాఠశాల భవనం పునర్మించాలని సీపీఎం నాయకుడు ఈరెల్లి చిరంజీవి కోరారు. ఆదివారం ఈస్కూల్ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ స్కూల్ భవనం నిర్మాణం చేపట్టి సుమారు 40 ఏళ్లు కావస్తుందని, శిథిల చేరడంతో పక్కనే రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎం.పెదపేట పాఠశాలకు పిల్లలు వెళ్లాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యపై పలు మార్లు విద్యాశాఖ అధికారులకు కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సామగ్రి పంపిణీ

రోలుగుంట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమరవోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం హెల్పింగ్ పీపుల్స్ యూత్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు సామిరెడ్డి రామమూర్తి నాయుడు, ఇతర సభ్యుల సొంత నిధులతో కొనుగోలు చేసిన ప్యాడ్లు, పెన్నులు, పెన్సిల్, స్కేల్ తదితర వాటిని అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటరావు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జీడి తోటలు దగ్ధం

రోలుగుంట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుసర్లపూడిలో ఆదివారం జీడితోటలు అగ్నికి ఆహుతయ్యాయి. ఆదివారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో గ్రామానికి చెందిన పచ్చిగొళ్ల భవన్నారాయణ, మఠం బెన్నయ్య, కూండ్రపు శ్రీను, సియాద్రి అప్పారావులకు చెందిన ఐదెకరాల జీడితోటలు దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చినా రహదారి సరిగ్గా లేక వాహనం వెనుతిరిగి వెళ్లిపోయింది. దీంతో రైతులు స్థానికంగా అందుబాటులోని నీటితో మంటలను అదుపు చేశారు.

ప్రభుత్వ పెన్షనర్ల సంఘం కార్యవర్గం ఎన్నిక

చోడవరం, మార్చి16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌ట్రెజరీ పరిధి ప్రభుత్వ పెన్షనర్ల సంఘం కార్యవర్గం ఎన్నిక శనివారం జరిగింది. అధ్యక్ష కార్యదర్శులుగా వీరనాల చినబాబు, బి. దక్షిణామూర్తిలు ఎన్నికయ్యారు. సంఘం గౌరవ అధ్యక్షులుగా సిరికి దేవానందం, సహాయ అధ్యక్షుడిగా వేగి మురళీకృష్ణారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గండి వెంకటరావు, కోశాధికారిగా కె. నాగేశ్వరరావు ఉపాధ్యక్షుడిగా కురచా దేముడు, గొర్లె మూర్తి, బుగత కృష్ణ, సహాయ కార్యదర్శులుగా పి. రాజశేఖర్, జీటీ కృష్ణ, వి. గోవిందరావు, కార్యనిర్వాహక సభ్యులుగా టి. సత్యం, కె.సింహాచలంనాయుడు, వి. రామచంద్ర మూర్తి, కె. వెంకటరావు, ఏటీవీ ప్రసాద్‌లు ఎన్నికయ్యారు.

జ్వరంతో నాలుగేళ్ల బాలుడి మృతి

చీడికాడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరహాపురానికి చెందిన తాటికొండ వరహాలునాయుడు కుమారుడు దేవాన్స్ (4) జ్వరంతో బాధపడుతూ విశాఖ కేజీహెచ్‌లో ఆదివారం మృతి చెందినట్టు బాలుడి మేనమామ ధర్మిశెట్టి భీమునాయుడు తెలిపారు. చెన్నైలో నివాసం ఉంటున్న దేవాన్స్‌కు జ్వరం రావడంతో 15 రోజుల కిందట వరహాపురం తీసుకు వచ్చారన్నారు. అనంతరం చోడవరం, విశాఖలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందాడన్నారు. బాలుడి పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచనపై ఆదివారం మధ్యాహ్నం కేజీహెచ్‌కు తరలించామన్నారు. అక్కడ చికిత్సపొందుతూ ఆయన తెలిపారు. బాలుడు మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

గ్రామాల్లో దాహం కేకలు

» ప్రారంభంకాని క్రాష్ ప్రోగ్రాం » చీడికాడ మండలంలో దుస్థితి


గుడివాడ స్కూల్ పక్కన మరమ్మతుకు నోచుకోని చేతిబోరు

చీడికాడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్యతో జనాలు అల్లాడుతారు. మూగజీవాలు చుక్కనీటి కోసం తహతహలాడుతుంటాయి. ఈ స్థితిలో వేసవిలో ఏటా ముందస్తుగా క్రాష్ ప్రోగ్రాం అమలు కావాలి. ఈ ఏడాది ఇంత వరకు మండంలో ఈ ప్రక్రియ ప్రారంభం కాలేదు. ఈ ప్రోగ్రాం ద్వారా గ్రామాల్లో తాగునీటి సమస్యలు గుర్తించాలి. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం నిధులు కేటాయిస్తుంది. బోర్‌వెల్ మెకానికల్‌లు, అధికారులు మొబైల్ వ్యాన్‌తో వెళ్లి రక్షిత నీటి పథకాలు, బోర్లు ట్యాంక్‌లకు అవసరమైన మరమ్మతులు చేపడతారు. ఎండలు ముదురుతున్నా ఈ క్రాష్ ప్రోగ్రాం ప్రారంభం కాకపోవడంపై విమర్శలు తలెత్తుతున్నాయి. సాధారంగా ఈ ప్రక్రియ ఫిబ్రవరి 15వ తేదీ నుంచి మార్చి 31లోగా పూర్తి చేయాలి. దీనికి అనుగుణంగా మందుగా ఆర్‌డబ్ల్యూ శాఖ అధికారులు మరింత కార్యచరణ సిద్ధం చేయాలి.

మండలంలో తాగునీటి వనరులివి..


గౌతమ్‌నగర్ కాలనీలో లీకవుతున్న వాటర్ ట్యాంకు

మండలంలో వివిధ గ్రామాల్లో 730 చేతి బోర్లు, 49 వాటర్ ట్యాంకులు ఉన్నాయి. క్రాష్ ప్రోగ్రాం ఈ నెలాఖరుకు పూర్తిచేసి అవసరమైన ప్రతిపాదన కాపీని ఏఈ ఎంపీడీవో కార్యాలయానికి ఇవ్వాల్సిఉంది. దీన్ని ఒక రిపోర్టుగా తయారు చేసి జిల్లా అధికారులకు సమర్పించారు. బోరులకు వాటి ట్యాంకుల అవసరమైన సామగ్రి 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి కోనుగోలు చేయాల్సి ఉంది. ఇప్పటికీ క్రాస్ ప్రోగాం ప్రారంభం కాకపోవడంతో గ్రామీణ ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వేసవిలో తాగునీటి సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని వాపోతున్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ క్రాష్ ప్రోగాంపై ఇప్పటికే గ్రామాల్లో తాగునీటి సమస్యలపై ప్రతిపాదనలను తయారు చేసి ఎంపీడీవో కార్యాలయానికి అందించినట్టు చెప్పారు. దీనిపై మండల పరిషత్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ మాత్రం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇంతవరకు తమకు ఏ ప్రతిపాదనలు అందించలేదంటున్నారు.



చీడికాడ ఎంపీడీవో కార్యాలయం

ప్రభుత్వ నిధులున్నా ఉపయోగంలేదు..



ఏటా ఫిబ్రవరి 15 నుంచి మార్చి 31 వరకు క్రాస్ ప్రోగ్రాం పూర్తి చేయాలి. నేటికీ 25 రోజులు పూర్తయినా దీనిపై అధికారులు ముందుకు రాలేదు. ప్రభుత్వం నిధులు కేటాయించినా తాగునీటి పథకాలు మరమ్మతులకు నోచలేదు. దీనిపై ఎమ్మెల్యే దృష్టితీసుకువెళ్తాం. మండల సమావేశంలో అధికారులను నిలదీస్తాం.

\- దారపు పెద్దినాయుడు
ఎంపీటీసీ సభ్యుడు దిబ్బలపాలెం

ప్రతిపాదన కాపీని ఎంపీడీవోకు ఇచ్చా..



మండలంలో తాగునీటి సమస్యలపై ఎంపీడీవోకు ఎస్టిమేట్ కాపీని అందించాను. మండలంలో ఉన్న బోర్లు, వాటర్ ట్యాంకులకు అవసరమైన మెటీరియల్, ఇందుకు అవసరమైన మొబైల్ వాహనంలో ముగ్గురు మెకానిక్‌లతో పాటు మరో వ్యక్తి అవసరం. అనుమతి ఇచ్చిన వెంటనే క్రాస్ ప్రోగాం ప్రారంభిస్తాం.

\- ఎస్. కనకమ్మ , ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

ఘనంగా నూకాంబిక విగ్రహ ప్రతిష్ఠ


నూకాంబికను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ

దేవరాపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) మండలంలోని నృసింహ గజపతినగరంలో నూకాంబిక విగ్రహ శిఖర ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే బండారు.సత్యనారాయణమూర్తి దర్శించుకున్నారు. ఈసందర్భంగా కోలాటం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకలో మాజీ ఉపముఖ్యమంత్రి బూడిముత్యాలనాయుడు, జడ్పీటీసీ సభ్యుడు కర్రిసత్యం, రైవాడ జలాశయ చైర్మన్ పోతల పాత్రునాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, వైసీపీ మండల అధ్యక్షుడు బూరేబాబూరావు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా మోదకొండమ్మ పండుగ

మాడుగుల రూరల్: మండలంలోని సాగరం, సాగరం కాలనీ, డిసురవరం గ్రామాల్లో ఆదివారం గ్రామదేవత మోదకొండమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. అమ్మవారి ఆల యంలో వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, ఘటాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రసాదం వితరణ చేశారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కొత్తకోటలో ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

రావికమతం:మండలంలో కొత్తకోట శ్రీఆంజనేయ స్వామి 31వ వార్షికోత్సవం ఆదివారంతో ఘనంగా ముగిసింది. ఈనెల 14న పారంభమైన ఈ ఉత్సవాల్లో మూడు రోజుల పాటు ఉత్సవ కమిటీ చైర్మన్ కె. గున్నాజీ రావు ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు, లక్ష సింధూర,తమలపాకులతో పూజలు నిర్వహించారు. ఆదివారం భక్తులు ఎత్తున దర్శించుకున్నారు. సాంస్కృతిక కార్య క్రమాలు, భారీగా బాణ సంచా ఆకట్టుకున్నాయి.

రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరుపై హర్షం


వీరబద్రపేటలో ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న గిరిజనులు

దేవరాపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపూడి పంచాయతీ శివారు వీర బద్రపేటకు ఎమ్మెల్యేబండారు సత్యనారాయణమూర్తి రూ.85 లక్షలు మంజూరు చేయడంతో గిరిజనులు హర్షం వ్యక్తంచేశారు. గత ప్రభుత్వంలో ఎన్ని నిరసనలు చేపట్టినా వారి మొర వినలేదు. ఇటీవల ఎమ్మెల్యే బండారు దృష్టికి తీసుకు వెళ్లడంతో స్పందించి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ శనివారం చేశారు. ఈ రోడ్డు కోసం కృషి చేసిన మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావుకు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్నకు తామర్ల బుచ్చిబాబు, ఈశ్వర రావు, కృష్ణ, బంగారుబాబు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

బుచ్చెయ్యపేట, మార్చి 16 (ఆంధ్ర జ్యో తి): వ డ్డాది కేపీడీ జడ్పీ హైస్కూల్‌లో 2008-09లో కలిసి చ దువు కున్న బంగారు మెట్ట గ్రామానికి చెం దిన మీసాల శివ గత వారం రైలు ప్రమా దం లో మృతి చెందారు. శివ కూలిపని చేసుకుని జీవిస్తున్నారు. అతని మృతితో కుటుంబం దిక్కుతోచని స్థితికి చేరింది. దీంతో తనతో చదువుకున్న తోటిమిత్రులు రూ.36 వేలు విరాళంగా మృతుని భార్య, తల్లికి అందించారు.

రోడ్డు ప్రమాదంలో ఎల్‌ఐసీ ఏజెంట్ మృతి


మృతుడు
మాడా కన్నారావు (ఫైల్)

మునగపాక, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మునగపాక జంక్షన్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన ఎల్‌ఐసీ ఏజెంట్ మాడా కన్నారావు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక ఎస్‌ఐ పి.ప్రసాదరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం ఉదయం కన్నారావు తన స్వగృహం నుంచి స్కూటీపై మార్కెట్‌కు వస్తుండగా అచ్యుతాపురం నుంచి అనకాపల్లి వైపు వెళ్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో లారీ ముందు చక్రం కింద పడి కన్నారావు మృతి చెందాడు. అతని భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ప్రసాదరావు తెలిపారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. కన్నారావుకు ఇద్దరు భార్యలు, ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న భార్య, బిడ్డలతో పాటు స్థానికులు పెద్ద ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేపట్టారు.

సైబర్ నేరాలపై అవగాహనకు బ్యానర్లు

కృష్ణాదేవిపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు, మహిళలపై దాడులపై ప్రజలకు అవగాహన కోసం ప్రధాన కూడలి వద్ద ఆదివారం ఎస్‌ఐ వై.తారకేశ్వరరావు బ్యానర్లను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల జంక్షన్, శరభన్నపాలెం జంక్షన్ తదితర చోట్ల బ్యానర్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ పరిమితి మించి ఆటోలు, ఇతర వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. సైబర్ ఫిర్యాదుల కోసం 1930 నంబర్‌ను సంప్రదించాలని, చట్టాలపై అవగాహన కలిగి వుండాలని తెలిపారు. కార్యక్రమంలో వర్తక సంఘం ప్రతినిధులు ఎస్.జోగుబాబు, వుడా రాజా, చక్రీ, రాజేశ్, వర్మ, రమేశ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

నాతవరం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వైబీపట్నంలో రూ.18 లక్షలు, ఎంబీపట్నంలో రూ.8 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ సారథ్యంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. నియోజకవర్గంతో జనసేన, టీడీపీ నాయకులు కలసికట్టుగా పనిచేస్తు అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్.వెంకటరమణ, వెలగ వెంకట, కృష్ణారావు, జనసేన మండల వెలగల వెంకటరమణ,

కో ఆపరేటివ్ బ్యాంక్ రికార్డులు కంప్యూటరీకరణ

బుచ్చెయ్యపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వడ్డాది కో ఆపరేటివ్ సొసైటీలో ఖాతాదారులు రికార్డులను డి జిటల్‌గా మార్పు చేయనున్నారు. గతంలోలెగ్జర్లు వినియోగించి నమోదు చేసేవారు. ప్రస్తుతం రి కార్డులన్నీ కంప్యూటరీకరణ చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో డీసీవో ప్రేమస్వరూపరాణి, డీఆర్ కిరణ్ కుమారి, పీఐసీ మురళీకృష్ణ, బ్రాంచి మేనేజర్ మ హే శ్వరరావు, లక్ష్మణరావు, వడ్డాది ఈవో శాంతి, సిబ్బంది పాల్గొన్నారు.

మూడు పశువుల పాకలు దగ్ధం


కాలిబూడిదైన మేకలు

బుచ్చెయ్యపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మం డలంలో రాజుపాలెం నకు చెందిన నమ్మి చిలుకు, సైద య్యలకు చెందిన మూడు పశువుల పాకలు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో 15 మేకలు కాలి బూడిదయ్యాయి. ప్రమాదం ఎలా జరిగిందో తెలియరాలేదు. స్థానిక స ర్పంచ్ జి.వరకృష్ణ, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు జికోటేశ్వరరావు, ఇతర నాయకులు బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు అభ్యర్థించారు.

70 మందికి కంటి పరీక్షలు


వేచలంలో నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు

దేవరాపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మం డలంలోని వేచలం గ్రామంలో అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 70 మందికి వైద్య పరీక్షలు చేసినట్టు ట్రస్ట్ చైర్మన్ గొంప వెంకటరావు తెలిపారు. శంకర్ ఫౌండేషన్ హాస్పిటల్ వైద్యులు పరీక్షలు నిర్వహించారు. 38 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపికచేశారు. రెడ్డి శేషు, నాని, దస్వంత్, శివ శంకరు, భాను ప్రకాష్, శంకర్ ఫౌండేషన్ క్యాంపు కోఆర్డినేటర్ అరుణ్ కుమార్, దివ్య. తదితరులు పాల్గొన్నారు.

చదరంగం మనో వికాసానికి దోహదం


బహుమతులు చూపిస్తున్న విజేతలు

మాకవరపాలెం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): చదరంగం పోటీలు మనో వికాసానికి ఎంతో దోహదపడతాయని చెస్ అకాడమీ నిర్వాహకుడు సుధీర్ చెప్పారు. ఆదివారం అవంతి కాలేజీలో జిల్లా చెస్ అసోసియేషన్ ప్రగతి చెస్ అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెస్ ఆడే పిల్లల మైండ్ ఎంతో ఫాస్ట్‌గా పని చేస్తుందన్నారు. అలాగే చెస్ పోటీల్లో విశాఖ జిల్లాకు చెందిన అఖిలప్రసాద్ మొదటి బహుమతి, ప్రకాశం జిల్లాకు చెందిన జెకె.రాజు, మూడో బహుమతి అనకాపల్లి జిల్లాకు చెందిన బి.సాకిల్ అందుకున్నారు. కార్యక్రమంలో కాలేజీ మెకానిక్ బ్రాంచ్ అధ్యాపకులు హరికృష్ణ, ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు శ్రీరామమూర్తి, లలితాకళాక్షేత్ర కార్యదర్శి శేషగిరిరావు పాల్గొన్నారు.

స్థలం కోసం వివాదం.. ఇరువర్గాల మధ్య కొట్లాట

» ఏడుగురికి గాయాలు » మేడివాడలో ఘటన


గాయపడిన పతివాడ కోటేశ్వరావు, రేవతి, లావణ్య

రావికమతం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో మేడివాడలో చిన్నపాటి స్థలంపై రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణ పరస్పర దాడులకు దారితీసింది. ఈ ఘటనలో ఏడుగురికి గాయాలయ్యాయి. స్థానిక ఎస్‌ఐ. ఎం.రఘువర్మ అందించిన వివరాలివి... మేడివాడ గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి గొర్లె భాస్కరావుకు పతివాడ కోటేశ్వరావు కుటుంబాల మధ్య గత కొన్నాళ్లుగా అడుగు స్థలం కోసం వివాదం కొనసాగుతోంది. ఈ సమస్యపై ఆర్మీ ఉద్యోగి భాస్కరావు గతేడాదిలో అప్పటి ఎస్‌ఐపై దాడికి పాల్పడ్డారు. దీంతో భాస్కరావుపై కేసు నమోదు చేసి రౌడీ షీటర్ తెరిచారు. ఇదిలా ఉండగా ఈ భూ సమస్యపై ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు తహసీల్దార్ కార్యాలయంలో విచారణ కొనసాగుతోంది. ఇదిలా ఉంటే ఆదివారం మధ్యాహ్నం గొర్లె భాస్కరావు, పతివాడ కోటేశ్వరావు మధ్య ఘర్షణ తలెత్తి ఇరు కుటుంబాలు దాడులు చేసుకున్నాయి. ఈ దాడుల్లో పతివాడ కోటేశ్వరావు, అతని భార్య రేవతి, కుమార్తెలు లావణ్య, లీలా సంధ్య, భాస్కరావు, అతని అన్న సత్తిబాబు, తల్లి వరహాలమ్మకు గాయాలయ్యాయి. తీవ్రంగా గాయ పడ్డ పతివాడ కోటేశ్వరావు కుటుంబాన్ని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి చికిత్సకు 108లో తరలించారు. భాస్కరావు (ఆర్మీ) కుటుంబాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రఘు తెలిపారు.

చీరాల సమీపంలో అరకు యువతి బలవన్మరణం



కొర్రా లక్ష్మి (ఫైల్)

కావూరివారిపాలెం (చీరాల), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కావూరి వారి పాలెం పంచాయతీ తులసీనగర్ సమీపంలోని రాయల్ మెరైన్ రొయ్యల ఫ్యాక్టరీలో యువతి బలవన్మరణం చెందింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాలివి.. అల్లూరి జిల్లా అరకులోయ మండలం మడగడ పంచాయతీ దానరంగిని గ్రామానికి చెందిన కొర్రా లక్ష్మి (22) సుమారు 5 నెలల కిందట ఫ్యాక్టరీలో ప్యాకింగ్ విభాగంలో పనికి చేరింది. అయితే ఈమెతో చిన్నాన్న కుమార్తె కూడా పనిచేస్తోంది. ఈక్రమంలో ప్రతి రోజు రాత్రి వేళలో ఫోన్‌లో ఎక్కువ సమయం గడిపే లక్ష్మి శనివారం పడుకునే ముందు ఫోన్‌లో ఎవరితోనే వాదన పడింది. అనంతరం అందరూ నిద్రపోయారు. ఉదయం లేచి చూసేసరికి లక్ష్మి మరుగుదొడ్లో ఉరి వేసుకుని కనిపించింది. సమాచారం అందుకున్న ట్రైనీ డీఎస్పీ అభిషేక్ ఈపూరుపాలెం సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. తల్లిదండ్రులకు ఇప్పటికే సమాచారం అందించారు. అయితే మృతురాలి సోదరి కూడా సుమారు మూడేళ్ల కిందట బలవన్మరణం చెందినట్లు సహచరులు చెప్తున్నారు.

ములియగుడలో సీసీ కెమెరాలు ఏర్పాటు



సీసీ కెమెరాలను వద్ద ఎస్ఐ, సర్పంచ్, తదితరులు

అనంతగిరి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అరకు సీఐ హిమగిరి ఆదేశాల మేరకు.. మండలంలోని టోకూరు పంచాయతీ ఆధ్వర్యంలోని ములియగుడ వద్ద సర్పంచి కిల్లో మోస్య ఆదివారం సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. ఈ సీసీ కెమెరాలను పరిశీలించిన అనంతరం ఎస్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పర్యాటక ప్రాంతాల్లో భద్రతను దృష్టిలో పెట్టుకుని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన సర్పంచ్‌ను అభినందించారు. ఈ కార్య క్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

'మీ కోసం' సద్వినియోగం చేసుకోండి



జీకేవీధి తహసీల్దార్ రామకృష్ణ

సీలేరు, మార్చి 16, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం నుంచి ప్రారంభమయ్యే మీకోసం కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని జీకే వీధి తహసీల్దార్ రామకృష్ణ కోరారు. ఆదివారం ఆయన స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే ఇకపై జిల్లా కలెక్టర్, ఆర్డీవో, పీవో కార్యాలయాలకు వెళ్లాలిన అవసరం లేకుండా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతులు స్వీకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సీతారామ్, ఆర్ఐ సహదేవ్, సీలేరు సర్పంచ్ పి. దుర్గో పాల్గొన్నారు.

'సీఎం చంద్రబాబుదే ఇళ్లకు అదనపు నిధుల ఘనత'



మాట్లాడుతున్న టీడీపీ నేత లక్ష్మణరావు

చింతపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పీవీటీజీలు, గిరిజన పక్కా గృహాల లబ్ధిదారులకు అదనపు నిధులు మంజూరుచేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లగా ఆదివాసీలకు వైసీపీ ప్రభుత్వం ఒక్క పక్కా గృహం కట్టిన దాఖలాలులేవన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పీవీటీజీలకు జిల్లాలో 38,385 పక్కా గృహాలు మంజూరు చేసిందన్నారు. 2021-22లో వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదల కాక నిలిచిన 17,111మంది పీవీటీజీ, ఇతర లబ్ధిదారులకు నిధులు మంజూరు చేసిందన్నారు. అలాగే, పీవీటీజీలకు రూ. లక్ష, గిరిజనులకు రూ.75వేల అదనపు నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందన్నారు. లబ్ధిదారులు త్వరిగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈకార్యక్రమంలో టీడీ పీ మండల ప్రధాన కార్యదర్శి శెట్టి నాగేశ్వరరావు, వర్తకసంఘం ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు అరడ వీరబాబు, నాయకులు నాగంనాయుడు, వెంకట రమణ పాల్గొన్నారు.

పాఠశాలల్లో తీరనున్న వసతి సమస్య

» రూ 11.79 కోట్లతో అదనపు తరగతి భవనాలు, డార్మిటరీ గదులు » కస్తూర్బా విద్యాలయాల్లోనూ అభివృద్ధి పనులు

కొయ్యూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కొయ్యూరు, చింతపల్లి జీకే వీధి మండలాలలో ప్రభుత్వ పాఠశాలల్లో వసతి కొరత తీరనుంది. ఈ మండలాల్లో 27 పాఠశాలలకు అదనపు తరగతి గదులుతో పాటు మూడు మండలాలలో కేజీబీవీ పాఠశాలల్లో డార్మిటరీలు, కొయ్యూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలిక వసతి గృహ నిర్మాణానికి రూ 11.79 కోట్లు మంజూరయ్యాయి. ఈ విషయంను సర్వశిక్ష అభియాన్ జేఈ బి. సత్యనారాయణ తెలిపారు. నాలుగు రోజుల కిందట మండలంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ 2.12 కోట్లతో నిర్మించనున్న బాలికల వసతి గృహ నిర్మాణాలకు గానూ జేఈ మార్కింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అభివృద్ధి పనులకు సర్వశిక్ష అభియాన్‌లో ఈ నిధులు కేటాయించినట్టు చెప్పారు.



కొయ్యూరు కస్తూర్బా విద్యాలయంలో చదును చేస్తున్న దృశ్యం

వీటితో కొయ్యూరులో 19 పాఠశాలలకు అదనపు తరగతి గదులు నిర్మాణాలకు గానూ ఒకొక్క పాఠశాలకు రూ 13.05 లక్షలు చొప్పున నిధులు మంజూరయ్యాయన్నారు. అలాగే చింతపల్లి మండలంలో ఆరు పాఠశాలలకు, జీకే వీధి మండలంలో రెండు పాఠశాలల్లో తరగతి గదుల నిర్మాణాలకు నిధులు కేటాయించినట్టు పేర్కొన్నారు. ఇవి కాకుండా ఈ మూడు మండలాలలో కస్తూర్బా పాఠశాలల్లో ఇంటర్ విద్యార్థులకు గానూ డార్మిటరీల నిర్మాణాలకు ఒక్కోదానికి రూ 2. 05 కోట్లు చొప్పున మంజూరుకాగా, వీటి నిర్మాణాలకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయి పనులు నిర్వహణకు వీలుగా మార్కింగ్ ఇస్తున్నామన్నారు. కొయ్యూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు గానూ రూ 2.12 కోట్లతో వసతి గృహ నిర్వహణకు భవన నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులన్నీ ఏపీసీ ఖాతాలో జమ అయ్యాయన్నారు. తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన నిబంధన మేరకు పీపీఈ పద్ధతిలో చెల్లింపులు జరుగుతాయన్నారు. ఎం. బుక్ రికార్డు చేసి దానికి సరిపడా నిధులను చెక్ రూపంలో కాంట్రాక్టరు ఇస్తే వారం రోజుల్లో ఆయన ఖాతాలో నిధులు జమ అవుతాయన్నారు. పాఠశాలలకు మంజూరైన అదనపు తరగతి గదుల నిర్మాణాలు పభుత్వ ఆదేశాల మేరకు నామినేషన్ పద్ధతిలో చేయించనున్నట్టుగా వెల్లడించారు.



కొయ్యూరు గవర్నమెంట్ పాఠశాలలో మార్కింగ్ ఇస్తున్న జేఈ

బాలికలపై లైంగిక దాడులకు పాల్పడితే పోక్సో కేసు

న్యాయ విజ్ఞాన సదస్సులో జిల్లా ప్రిన్సిపల్ జడ్జి ఆలపాటి గిరిధర్

పాడేరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): బాలికలపై లైంగిక దాడికి పాల్పడిన వారిపై పోక్సో కేసు నమోదు చేస్తామని జిల్లా ప్రిన్సిపల్ జడ్జి ఆలపాటి గిరిధర్ అన్నారు. స్థానిక శ్రీకృష్ణాపురం బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కేసులో నేరస్తులకు 15 ఏళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. అలాగే బాలికలు సైతతం సమాజంలో అప్రమత్తంగా ఉండాలని సినిమాల ప్రభావానికి, ఇతరుల ప్రలోభాలకు గురికావద్దని సూచించారు. డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. పోక్సో కేసు పూర్వాపరాలపై జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ అధ్యక్షురాలు ఎంవీ.శేషమ్మ బాలికలకు వివరించారు. జిల్లా అడిషనల్ ఎస్పీ కె.ధీరజ్ మాట్లాడుతూ... బాలికలను మభ్యపెట్టే వారిపైనా పోక్సో నమోదు తప్పదని హెచ్చరించారు. అనంతరం విమెన్ హెల్ప్‌లైన్ నెంబర్ల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో చోడవరం సబ్ జడ్జి వి.గౌరీశంకర్, అనకాపల్లి ప్రిన్సిపల్ జడ్జి ధర్మారావు, ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి, డీఎంహెచ్‌వో సి.జమాల్‌బాషా, డీఈవో పి.బ్రహ్మాజీరావు, గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీ ఎల్.రజని, తాహశీల్దార్ వి.త్రినాదరావు, నాయుడు, టీచర్లు, ఐసీడీఎస్ సిబ్బంది, గిరిజన బాలికలు పాల్గొన్నారు.



పాడేరులో మాట్లాడుతున్న న్యాయమూర్తి గిరిధర్, పక్కన అడిషనల్ ఎస్పీ కె.ధీరజ్

విద్యార్థినులు చైతన్యవంతులు కావాలి

చింతపల్లి: లైంగిక నేరాల నుంచి చిన్నారులకు రక్షణ కల్పించనున్న పోక్సో (పీవోసీఎస్‌వో)పై విద్యార్థినులు చైతన్యవంతులు కావాలని విశాఖపట్నం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ సూచించారు. ఆదివారం స్థానిక బాలికల గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలలో జిల్లా న్యాయశాఖ అధికారులు విద్యార్థినులకు పోక్సో చట్టంపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన న్యాయమూర్తి మాట్లాడుతూ పోక్సో చట్టం 2012లో అమలులోకి వచ్చిందన్నారు. 18ఏళ్లలోపు బాలబాలికలందరికీ లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పిస్తుందన్నారు. సోషల్ మీడియాపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి ఎంవీ శేషమ్మ, స్థానికప్రథమ శ్రేణి జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ న్యాయస్థానం న్యాయమూర్తి ఎం. రోహిత్, ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు, సీడీపీవో జీవీ రమణ, ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి, వైద్యాధికారి సౌమ్య, తహసీల్దార్ బి. రవికుమార్, ఎస్సై వి. వెంకటేశ్వరరావు, ఎంఈవో పీవీవీవీ ప్రసాద్, పీజీహెచ్ఎం జేఏ కొండలరావు, హెచ్‌డబ్ల్యూవో నూకరత్నం, టీచర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న గిరిజన విద్యార్థినులు

సీలేరు: విద్యలో రాణించి ఉన్నతస్థాయికి చేరాలని ఉమ్మడి విశాఖ జిల్లాల జడ్జి ఆలపాటి గిరిధర్ అన్నారు. ఆదివారం జీకేవీధి మండలం సీలేరు జడ్పీ పాఠశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ, చింతపల్లి జూనియన్ సివిల్ జడ్జి ఎం రోహిత్, డీఈవో బ్రహ్మాజీరావు, ఐసీ డీఎస్ సీడీపీఓ లక్ష్మి, సీఐ వరప్రసాద్, తహసీల్దార్ రామకృష్ణ, వైద్యాధికారులు మస్తాన్‌వీల్లీ, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాయాలి

» అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

పెదబయలు, మార్చి పెదబయలు16 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాయాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సూచించారు. ఆదివారం ఆయన మండంలోని తురకలవలస ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలను సందర్శించారు. పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం అయినా విద్యార్థినులతో సమావేశమై మాట్లాడారు. ఏ రంగంలో స్థిర పడాలన్నా, పదో తరగతి మార్కులు కీలకమని చెప్పారు. అందువల్ల భయం వదిలి పరీక్షలు రాయాలని కోరారు. జీవితంలో స్థిరపడి తల్లిదండ్రులు, పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. అలాగే ఇటీవల పాఠశాలలో కలుషిత ఆహారం తిని 35 మంది విద్యార్థినులు అస్వస్థకు గురైన విషయంపై ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్ణయించినా మెనూ సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు.

పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయం



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళర్పిస్తున్న విద్యార్థులు, శాస్త్రవేత్తలు

చింతపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయమని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త పి. జోగారావు అన్నారు. ఆదివారం సేంద్రీయ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో పొట్టిశ్రీరాములు జయంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి, ప్రాణాలు అర్పించిన అమరజీవి అన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మీ కోసం'లో దరఖాస్తులు చేసుకోవాలి: తహసీల్దార్

పెదబయలు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మీ కోసం కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు గండేరు రంగారావు తెలిపారు. మండలంలో గల అన్ని శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ప్రజలు వచ్చి వినతులు అందించాలని కోరారు.

పదో తరగతి పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

కొయ్యూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు మండలంలో అన్ని ఏర్పాట్లు చేశారు. మండలంలోని గురుకుల పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీ, బాలారం జడ్పీ ఉన్న పాఠశాలతో పాటు 11 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు చెందిన 680 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరికి కొయ్యూరు గురుకుల పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సీఏ హెచ్ బాలురు- 1 పాఠశాలలను పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. గురుకుల పాఠశాలలో 10 రూమ్‌లు, సీఏహెచ్‌లో 10, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8 రూమ్‌లు కేటాయించి వాటిలో పరీక్ష నిర్వహణకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేశారు. అలాగే, పరీక్షల్లో మాస్ కాపీయింగ్ నిరోధానికి ప్రతీ కేంద్రానికి సూపరింటెండెంట్, డిపార్టు మెంట్ అధికారి, సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశారు.

అనంతగిరి: మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నారు. అనంతగిరి, కొత్తూరు కేజీబీవీలోని సీసీ కెమెరాలు ఉండగా.. ఈ ఏడాది కొత్తవలస, శివలింపురంలోని నూతనంగా ఏర్పాటు చేశారు.. 14 ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు, 1 గురుకులం, 1 కేజీబీవీ నుంచి 717 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. గతంలోని అనంతగిరి, కొత్తూరు కేజీబీవీ పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఉన్నా మాస్ కాపింగ్ జరిగిందనే ఆరోపణలో వినిపించాయి. ఈ ఏడాది కొత్తవలస, శివలింగపురం పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. దీంతో మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం ఉండదని అధికారులు చెబుతున్నారు.



చింతపల్లి చేరుకున్న తాజంగి కస్తూర్బా విద్యాలయం విద్యార్థినులు



కొయ్యూరుల్లో నంబర్లు వేస్తున్న దృశ్యం

చింతపల్లి చేరుకున్న విద్యార్థులు

చింతపల్లి: పదో తరగతి పరీక్షలకు పలు పాఠశాలల విద్యార్థులు మండల కేంద్రానికి చేరుకున్నారు. సోమవారం నుంచి పరీక్షలు జరుగుతాయి. బాలుర ఆశ్రమ పాఠశాల-1లో 180, బాలుర-2లో 155, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 180, బాలికల ఆశ్రమ పాఠశాలలో 171 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఆదివారం సాయంత్రానికి వంగసార, లంబసింగి, కస్తూర్బా విద్యాలయాలనుంచి పది విద్యార్థులు చింతపల్లి చేరుకోగా స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలలో వసతి కల్పించారు. పెదబరడ, లంబసింగి, ఎ.శనివారం, జాజులపాలెం పాఠశాలలకు చెందిన విద్యార్థులకు బాలుర-1 ఆశ్రమ పాఠశాలలో వసతి కల్పించారు. పది విద్యార్థులు వసతి, భోజన ఇతర సదుపాయాలు పూర్తి స్థాయిలో కల్పిస్తున్నట్టు ఏటీడబ్ల్యూవో జయ నాగలక్ష్మి తెలిపారు.

డుంబ్రిగుడ: డుంబ్రిగుడ మండలంలోని పది పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు చేసినట్టు ఎంఈవో సుందరరావు తెలిపారు. ఈ పరీక్షలకు 569 మంది విద్యార్థులు మూడు పరీక్ష కేంద్రాల్లో రాయనున్నారని అన్నారు.

కలెక్టర్ గారూ... మీ మేలు మరువలేం

» బూరిగ, చినకోనెల రోడ్డు పనులకు అనుమతి

» గిరిజనులు థింసా నృత్యాలతో హర్షం



అటవీశాఖ అనుమతుల జారీతో థింసా నృత్యాలతో ఆనందం వ్యక్తంచేస్తున్న గిరిజనులు

అనంతగిరి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపల్లి పంచాయతీ బూరిగ, చినకోనెలకు రహదారి నిర్మాణానికి అనుమతులు రావడంతో ఆ గ్రామాల గిరిజనులు ఆదివారం కలెక్టర్ దినేశ్‌కుమార్‌కు థింసా నృత్యాలతో తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు. మెంటాడ మండలం వాణిజ నుంచి అనంతగిరి మండలం బూరిగ, చినకోనెల గ్రామాల రోడ్డు నిర్మాణానికి 2024లోని ఉపాధి హమీ నిధులు రూ. 3 కోట్లు మంజూరయ్యాయి. అయితే అటవీశాఖ అనుమతులు లేక ఈ పనులు మధ్యలో నిలిచిపోయాయి. దీనిపై గిరిజనులు నిరసనలపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనాలు రావడంతో జిల్లా కలెక్టర్ అటవీశాఖ అనుమతులు జారీ చేశారు. రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. దీంతో గిరిజనులు ముఖానికి రంగులు పూసుకుని, తమ ఆచార సంప్రదాయ థింసా నృత్యాలతో కలెక్టర్ కు మేలు మరువలేమంటూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ రోడ్డు పూర్తయితే.. బూరిగ, చినకోనెలతో పాటుగా ఎన్ఆర్‌పురం పంచాయతీ బొంగిజ, డెంజనివలస, పెద్దవలస, చిముడువలస, రాయిపాడు గ్రామాలకు రాకపోకలకు వీలుకలుగనుంది.

ట్రావెల్స్ బస్సు నుంచి మంటలు



చీకటిలో వేచి ఉన్న ప్రయాణికులు

ఎస్. రాయవరం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు 36 మంది ప్రయాణికులతో వెళుతున్న వీఆర్ఎల్ ట్రావెల్ బస్సు నుంచి ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో మంటలు వ్యాపించాయి. అటుగా వెళుతున్న వాహనచోదకులు డ్రైవర్‌ను అప్రమత్తం చేయడంతో పెనుప్రమాదం తప్పింది. మండలంలోని గెడ్డపాలెం జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై ఈ సంఘటన జరిగింది. డ్రైవర్ బస్సును రోడ్డు పక్కన నిలపడంతో ప్రయాణికులు భయంతో బయటకు పరుగులు తీశారు. బస్సు వెనుక భాగంలో ఉన్న చక్రాల నుంచి మంటలు రావడంతో వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వెనుక చక్రాల డ్రమ్ము పట్టేయడంతో మంటలు వ్యాపించాయని డ్రైవర్ తెలిపాడు. మరో బస్సులో తమను తరలించాలని డ్రైవర్‌ను ప్రయాణికులు కోరారు. అయితే తానేమీ చేయలేనని డ్రైవర్ చెప్పడంతో అసహనం వ్యక్తం చేశారు. బస్సులో 36 మంది ప్రయాణిలు ఉండగా, వీరిలో సగం మంది మహిళలు ఉన్నారు. వీరంతా చీకట్లో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటల వరకు వేచి ఉన్నారు.

సీతాకోక చిలుకల కనువిందు

... 5వ పేజీ తరువాయి

వెల్లడైంది. ఈ పరిశోధనలో భూషల వెంకటరమణ, సూరిశెట్టి రవిబాబు భాగస్వాములయ్యారు.

వాతావరణ మార్పుల ప్రభావం

వాతావరణ మార్పులకు గురైన అనేక జాతుల జాబితాలో సీతాకోకచిలుకలు చేరాయి. వృక్షసంపద, సమశీతోష్ణస్థితి పరిస్థితులు వాటి జీవనానికి దోహదపడతాయి. అయితే చెట్లు నరికేయడం, శరవేగంగా మానవ ఆవాసాలు విస్తరించడం, వర్షాలు తగ్గడం, వేడి వాతావరణం నెలకొనడం వంటి ప్రతికూల పరిస్థితులు సీతాకోక చిలుకల ఉనికిపై ప్రభావం చూపుతున్నాయి. కంబాలకొండ, జూ, కైలాసగిరి, యారాడ కొండ పరిసరాల్లో గుంపులుగా సంచరించే సీతాకోకచిలుకలు ఇప్పుడు బాగా తగ్గిపోయాయి. సమూహంగా పయనించడం వీటి ప్రత్యేకత. కేవలం 20 రోజులు మాత్రమే జీవించే సీతాకోక చిలుక ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి నిత్యం వలస పోతుంటాయి. మధ్యలో కొన్ని రకాల ఔషధ మొక్కలు, గుబురుగా ఉండే మొక్కలపై గుడ్లు పెడతాయి. విశాఖ నుంచి ఒడిశా వరకు సీతాకోక చిలుకలకు ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. అయితే ప్రస్తుతం వాతావరణంలో మార్పుల నేపథ్యంలో వాటి ఉనికి ప్రమాదంలో పడింది.

నేటి నుంచి టెన్త్ పరీక్షలు

... 5వ పేజీ తరువాయి

కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. హాల్ టికెట్లను ముందుగా తనిఖీ చేసి విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు, పరీక్షల విభాగం సహాయ సంచాలకులు ఎ.శ్రీధర్‌రెడ్డి, విద్యాశాఖ, రెవెన్యూ, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా పదవ తరగతి రాష్ట్రస్థాయి పరిశీలకుడు పి.శ్రీనివాసరావు స్క్వాడ్‌లు, సెంటర్ కస్టోడియన్‌లతో సమావేశం నిర్వహించారు. అలాగే ఎంఈవోలు, ప్రధానశాఖ అధికారులు, ప్రధాన సూపరింటెండెంట్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పరీక్షలు సజావుగా నిర్వహించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు.

పటిష్ఠ బందోబస్తు

అనకాపల్లి రూరల్: పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభంకానున్న నేపథ్యంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్పీ తుహిన్‌సిన్హా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు ఉదయం తొమ్మిది గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, పరీక్ష పూర్తయ్యే వరకు కేంద్రం నుంచి బయటకు వెళ్లడానికి అనుమతి లేదన్నారు. హాల్లోకి చీఫ్ సూపరింటెండెంట్ తప్ప ఎవరూ మొబైల్ ఫోన్ తీసుకురావద్దని సూచించారు. విద్యార్థులు హాల్ టికెట్ తప్పనిసరిగా తీసుకురావాలని, సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, సమీపంలోని జెరాక్స్, ఇంటర్నెట్ షాపులు మూసివేయాలని ఆదేశించినట్టు ఆయన పేర్కొన్నారు.

బైక్ విన్యాసాలతో అలజడి

... 5వ పేజీ తరువాయి

చెందుతున్నారు. దాదాపుగా విద్యా సంస్థలన్నీ సమీపంలోనే ఉండడంతో కాలేజీ జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇదే సమయంలో బైక్‌ల విన్యాసాలు చేస్తుండడం అందరినీ కలవరపాటుకు గురిచేస్తున్నది. గతంలో స్పీడుగా వాహనాలు నడిపే యువకులను పోలీసులు స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పరిస్థితి కాస్త సద్దుమణిగినా, మళ్లీ ఇటీవల కాలంలో యథావిధిగా బైక్‌ల దూకుడు పెరిగిపోయింది. పోలీసులు మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో ఈ పాయింట్ వద్ద ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి వాహనాలు నడిపే విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తే తప్ప పరిస్థితిలో మార్పువచ్చే అవకాశాలు కనిపించడం లేదు. ఒకే బైక్‌పై ముగ్గురు, నలుగురు కూర్చోవడం, వేగంగా వెళుతుండడం వల్ల ప్రమాదం జరిగితే వాహనంపై ఉన్నవారితో పాటు రోడ్డుపై వెళ్లేవారు తీవ్రంగా గాయపడే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. పోలీసు అధికారులు స్పందించి యువకులు బైక్‌ల విన్యాసాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు. .

బొర్రా గుహల అభివృద్ధికి అవరోధాలు

... 5వ పేజీ తరువాయి

చేపట్టాలని ఏపీటీడీసీ ప్రణాళిక రూపొందించింది. అందులో రెండు ఎకరాలు పార్కింగ్‌కు కేటాయించారు. బొర్రా గుహలకు వచ్చే మార్గంలో అందమైన స్వాగత ద్వారం, గుహల వద్ద మరో ద్వారం ఏర్పాటు చేయాలని డిజైన్లు సిద్ధం చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎలక్ట్రిక్ చార్జింగ్ వాహనాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రతిపాదించారు. ప్రధాన మార్గం నుంచి గుహల వరకు వాటినే నడపాలని నిర్ణయించారు. పర్యాటకుల కోసం టాయిలెట్లు, లగేజీ భద్రపరచుకునే గదులు తదితరాలు అందులో ఉన్నాయి. స్థానిక గిరిజనులు తయారుచేసిన కళాకృతులు, పండించిన ఆర్గానిక్ ఉత్పత్తులను విక్రయించుకోవడానికి మార్కెట్ ప్లాన్ చేశారు. గుహలకు వెళ్లే మార్గంలో రెండు వైపులా ఫుట్‌పాత్‌లు, లోయల అందాలను తిలకించేందుకు వ్యూ పాయింట్లు, విజువల్ డెక్‌లకు స్థలాలు ఎంపిక చేశారు. ఎంటర్‌టెయిన్‌మెంట్ కోసం ఎడ్వెంచర్ స్పోర్ట్స్, ఎగ్జిబిషన్ నిర్వహించాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. గుహ లోపలి అందాలను విభిన్న కోణాల్లో చూపించడానికి సౌండ్ అండ్ లైటింగ్ సిస్టమ్‌ను ప్లాన్ చేశారు. ఇది మంచి ప్రాజెక్ట్ అయినప్పటికీ పర్యాటక శాఖ నిధులు మంజూరుకు ముందుకు రాకపోవడంతో ఆసక్తి ఉన్నప్పటికీ కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదనే వాదన వినిపిస్తోంది. ప్రభుత్వం వారికి నమ్మకం కలిగేలా హామీ ఇస్తే తప్ప కొత్త ప్రాజెక్టులు పట్టాలపైకి వచ్చే అవకాశం లేదనే వాదన వినిపిస్తోంది.

వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు ఒరిగిందేమీ లేదు

▸▸ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు

అనకాపల్లి టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీ సామాజికవర్గాలకు ఒరిగిందేమీ లేదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల ఓ హోటల్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు బంధం వెంకటరమణ అధ్యక్షతన ఆదివారం బీసీ సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన నాగేశ్వరరావు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ఉన్న 34 శాతం రిజర్వేషన్‌ను వైసీపీ ప్రభుత్వం 24 శాతానికి తగ్గించి అన్యాయం చేసిందన్నారు. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రిజర్వేషన్ 34 శాతానికి ప్రకటించిందన్నారు. గత ప్రభుత్వం కార్పొరేషన్లకు పదవులు కట్టబెట్టి నిధులు కూడా ఇవ్వలేదన్నారు. టీడీపీ ప్రభుత్వం నిధులు కూడా ఇచ్చిందన్నారు. బీసీలకు 50 శాతం సబ్సిడీతో రుణాలు కూడా మంజూరు చేస్తుందని వివరించారు. నామినేటెడ్ పదవుల్లో జనాభా నిష్పత్తి ప్రకారం పదవులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే బీసీ వసతిగృహాలను అభివృద్ధిపరచాలన్నారు. అన్ని పార్టీలు బీసీలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత నివ్వాలన్నారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘాన్ని గతంలో పట్టించుకోకపోవడంతో బీసీ సంక్షేమ సంఘం ద్వారా పోరాటాలు చేయాల్సి వచ్చిందన్నారు. 93 శాతం బీసీలు రాష్ట్రంలోని టీడీపీ ప్రభుత్వాన్ని గెలిపించారన్నారు. బీసీలకు అన్ని రంగాల్లో ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తుందని వివరించారు. సంఘ రాష్ట్ర ఇన్‌చార్జి నూకానమ్మ మాట్లాడుతూ ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు పదవుల్లో ప్రాధాన్యతనిచ్చిందన్నారు. ఎంపీ కార్యాలయ ప్రతినిధి విజయ్ మాట్లాడుతూ బీసీల సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భరిణికాన బాబూరావు, రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్, ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి పెదపాటి కల్యాణి, కార్యదర్శి కొణతాల అప్పలరాజు, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.మల్లేశ్, రాష్ట్ర కన్వీనర్ వేణుగోపాల్, సభ్యులు బత్తుల నాగేశ్వరరావు, పంచదార్ల సూరిబాబు, సబ్బి శ్రీనివాసరావు, బత్తుల లక్ష్మి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

బీసీ సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ఇన్‌చార్జిగా కల్యాణి

జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్, ఉత్తరాంధ్ర ఇన్‌చార్జిగా కశింకోటకు చెందిన పెదపాటి కల్యాణి నియమితులయ్యారు. అనకాపల్లిలో జరిగిన సంఘ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు చేతుల మీదుగా ఆమె నియామకపు పత్రాన్ని అందుకున్నారు. అలాగే రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా చింతకాయల కొర్లయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పిల్లల శంకరరావు, జిల్లా యువజన కార్యదర్శి సిమ్మ శ్రీను, మరో కార్యదర్శిగా ఎలమంచిలి ప్రసాద్‌లు నియమితులు కావడంతో, వారికి కూడా రాష్ట్ర అధ్యక్షుడు నియామకపు పత్రాలను అందజేశారు.

ఆంధ్ర రాష్ట్రం పొట్టి శ్రీరాములు త్యాగఫలం

డీఆర్‌వో వై.సత్యనారాయణరావు

వాడవాడలా అమరజీవికి నివాళులు

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగా ప్రత్యేక ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందని డీఆర్‌వో వై.సత్యనారాయణరావు పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ పాల్గొని పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం గాంధేయ మార్గంలో నిరాహార దీక్ష చేసి ప్రాణాలను తృణప్రాయంగా వదిలి అమరజీవిగా నిలిచారన్నారు.


పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్‌వో

అనకాపల్లి పట్టణంలో....

అనకాపల్లి టౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నివాళులు అర్పించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పి.రవికుమార్ అమరజీవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయ జంక్షన్‌లోని అమరజీవి విగ్రహానికి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అబ్దుల్‌కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ల ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో శ్రీరాములు విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మెయిన్‌రోడ్డులోని పొట్టి శ్రీరాములు భవనంలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పి.మూర్తి, కె.పార్వతి, జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు శ్రీనివాసరావు

ప్రశాంతంగా పరీక్షలు రాసేలా చూడండి

▸▸ పదో తరగతి పరీక్షల రాష్ట్ర పరిశీలకులు పి.శ్రీనివాసరావు

అనకాపల్లి టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసే విధంగా చర్యలు తీసుకోవాలని పదో తరగతి పరీక్షల రాష్ట్ర పరిశీలకుడు, రాష్ట్ర విద్యా శాఖ అదనపు సంచాలకుడు పి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. పట్టణంలోని పలు పరీక్షా కేంద్రాలను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల్లో ఉన్న బల్లలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలు రాసుకోవడానికి అనుకూలంగా బల్లలు ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అన్ని ఫ్యాన్లు తిరిగే విధంగా సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడా ఎటువంటి ఆరోపణలకు తావులేకుండా పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నందున నిర్వహణ పట్ల అధికారులు, సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు మాట్లాడుతూ జిల్లాలోని 107 పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. వీటిలో ఏడు కేంద్రాల్లో ఎస్ఎస్‌సీ బోర్డు విద్యార్థులతో పాటు ఓపెన్ స్కూల్ విద్యార్థులు కూడా పరీక్షలు రాస్తారన్నారు. 22,042 మంది రెగ్యులర్, 1258 మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని, 667 మంది ఓపెన్ స్కూల్ అభ్యర్థులు పరీక్షలు రాస్తారన్నారు. వారి వెంట అధికారులు ఉన్నారు.

టెక్నాలజీలో భారతదేశం పురోగతి

▸▸ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ చీఫ్ బాలప్రసాద్


ముఖ్య అతిథులను సత్కరిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లి టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): భారతదేశం డిజిటల్ యుగంలో ముందంజలో ఉందని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ చీఫ్ బాలప్రసాద్ అన్నారు. స్థానిక దైట్ ఇంజినీరింగ్ కళాశాలలో నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రెండ్స్ ఇన్ కంప్యూటింగ్ టెక్నాలజీ ముగింపు వేడుకల్లో ఆదివారం ఆయన మాట్లాడారు. టెక్నాలజీ ద్వారా అన్ని రంగాల్లో వేగంగా దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమన్నారు. భారతదేశం డిజిటల్ వనరులను బలోపేతం చేయడానికి రీ సెంట్రలైజ్డ్, ఇంటర్ ఆపరబుల్ మోడల్స్‌ను అమలు చేస్తుందని డాక్టర్ సురేష్‌ఆడీ వివరించారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ ఈ జాతీయ సదస్సు ద్వారా సాంకేతికత, పరిశోధనా, పరిశ్రమలతో విద్యార్థుల అనుసంధానం బలపడిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెమో 57ను ఉద్యోగులకు వర్తింపజేయాలి

డీఎస్సీ-2003 ఉపాధ్యాయ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు అప్పలరాజు



సమావేశంలో మాట్లాడుతున్న అప్పలరాజు

అనకాపల్లి టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో 57ను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు తక్షణమే వర్తింపజేయాలని డీఎస్సీ-2003 ఉపాధ్యాయ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రొంగలి అప్పలరాజు కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎస్ అమలు తేదీ 2004 సెప్టెంబరు ఒకటి కన్నా ముందు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన వారందరికీ పాత పెన్షన్ వర్తింపజేయాలని కోరారు. అలాగే పలు అంశాల పై చర్చించుకున్నారు. జిల్లా కన్వీనర్లు జకీర్ ఆలీ, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలపై పోలీసుల దాడి


పట్టుబడిన పందేంరాయుళ్లతో పోలీసులు

పరవాడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లలపాలెం శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్న వారిపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో రెండు కోడి పుంజులతో పాటు రూ.9,830 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ బి.కృష్ణారావు తెలిపారు. ఈ దాడుల్లో కానిస్టేబుళ్లు శ్రీనివాసరావు, చిరంజీవి, లక్ష్మణరావు, మురళీ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా గోవిందరాజు


గోవిందరాజు

పరవాడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా తాడి గ్రామానికి చెందిన బంతికోరు గోవిందరాజును నియమించారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు నుంచి ఉత్తర్వులను అందుకున్నట్టు ఆయన తెలిపారు. అలాగే జీవీఎంసీ 80వ వార్డు ఇన్‌చార్జిగా కూడా నియమించినట్టు చెప్పారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.

ముత్యాలమ్మతల్లి పండుగ రేపు

పరవాడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడచీపురుపల్లి, నాయుడుపాలెం పంచాయతీల ప్రజల ఆరాధ్యదైవం ముత్యాలమ్మతల్లి పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. ప్రధాన రహదారి నుంచి ఆలయం వరకు విద్యుత్ దీపాలంకరణ చేపట్టారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి అమ్మవారి దర్శనాలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అమ్మవారి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఉంటుందన్నారు. అలాగే రాత్రి ఏడు గంటల నుంచి పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తామని వారు చెప్పారు.

అదనపు విద్యుత్ చార్జీలు రద్దు చేయాలి

అనకాపల్లి టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అదనపు చార్జీలను వెంటనే రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఆదివారం సీపీఎం నాయకులు గవరపాలెంలోని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. విద్యుత్ వినియోగం చార్జీల కన్నా అదనపు చార్జీల భారం ఎక్కువగా ఉంటుందని పలువురు మహిళలు తమ దృష్టికి తీసుకువచ్చినట్లు సీపీఎం నాయకుడు పెంటకోట శ్రీనివాసరావు అన్నారు. తక్షణమే అదనపు చార్జీలను రద్దు చేయాలన్నారు. ఈ ప్రచారంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు కొణతాల త్రినాథ్, కాళ్ల తేలయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

▸▸ సీఐటీయూ నాయకుడు గనిశెట్టి

పరవాడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు ఏడు వారాల వేతనాలు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పెదముషిడివాడ పంచాయతీ పరిధిలోని గండివానిపాలెం గ్రామంలో ఉపాధి కూలీలతో సమావేశమై మాట్లాడారు. కూలీల వేతనాలు చెల్లించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఉపాధి కూలీలు జి. అప్పారావు, ఎన్.నాగలక్ష్మి, పి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

సబ్బవరం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయం సీఐ పిన్నింటి రమణ అన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సబ్బవరం రూరల్ వాసవీమాత సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ ఏడాది ఎండలు ఎక్కువగా ఉన్నాయని, ఈ సమయంలో వాసవీమాత సంఘం చలివేంద్రం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు ప్రతి రోజు కుండలు శుభ్రం చేసి తాగునీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ జోనల్ చైర్మన్ బీవీ.నాగరామారావు, క్లబ్ అధ్యక్షుడు డి.సంతోశ్‌గుప్తా, కార్యదర్శి డి.సన్యాశిరావు, కోశాధికారి నున్న సతీశ్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.


చలివేంద్రం ప్రారంభిస్తున్న సీఐ పిన్నింటి రమణ

ఘనంగా పడమటమ్మతల్లి పండుగ


అమ్మవారిని దర్శించుకుంటున్న పీలా గోవింద సత్యనారాయణ

కశింకోట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పడమటమ్మతల్లి పండుగ ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు తెల్లవారుజామున నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఇదిలా ఉంటే రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. వీరిని ఆలయ కమిటీ ప్రతినిధులు శాలువాతో సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


నాగరాజు కుటుంబీకులకు ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

సబ్బవరం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారపాడు శివారు బలిజపాలెంకు చెందిన గొర్లి నాగరాజు గత నెల 23న మృతి చెందగా, అతని కుటుంబానికి స్టీల్‌ప్లాంటు సెంట్రస్ స్టోర్ డిపార్టుమెంట్ రూ.1.7 లక్షల ఆర్థిక సాయం అందించింది. నాగరాజుకు భార్య వాణి, కుమార్తె ఇందు, శిరీష ఉన్నారు. తోటి కార్మికుడి కుటుంబ సభ్యుల ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న మిగతా కార్మికులు తలో చెయ్యి వేసి రూ.1.7 లక్షలు పోగు చేశారు. ఈ మొత్తాన్ని ఆదివారం నాగరాజు కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం సభ్యులు కర్రి శ్రీను, గొర్లి నాగరాజు, జెట్టి నాయుడు, పొట్నూరి ప్రసాద్, మామిడి వరహాలు, ఎర్ర సోంబాబు, కంద రాజు, చిన్ని సోంబాబు, కనకారావు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

ఏపీ జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

విశాఖపట్నం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ద్వారా 2013 నుంచి ఆర్ట్ వర్క్ పీఈటీ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారిని క్రమబద్ధీకరించాలని, సాధ్యం కాకుంటే కనీసం సమాన పనికి సమాన వేతనం వర్తింపచేయాలని ఏపీ జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో ఆంధ్రప్రదేశ్ వర్క్ ఆర్ట్ పీఈటీ ఇన్‌స్ట్రక్టర్స్ యూనియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖ ఉమ్మడి జిల్లా ప్రాంతీయ సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయులుగా 5,800 మంది, కాంట్రాక్ట్ పద్ధతిలో 460 మంది పనిచేస్తున్నారని పేర్కొన్నారు. తక్షణమే మినిమమ్ టైమ్ స్కేల్ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల బోధనకు తగిన విధంగా సిలబస్ లేకపోవడం, ఇతర పనులు ఎక్కువగా చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించలేకపోతున్నామని తెలిపారు. గతంలో జారీ చేసిన ఉత్తర్వు ప్రకారం ఈఎస్ఐ, ఈపీఎఫ్ ప్రయోజనాలు తక్షణమే అమలు చేయాలని బొప్పరాజు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. మధ్యాహ్నం జరిగిన ప్రాంతీయ సదస్సులో ఇటీవల ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీగా ఎన్నికైన గాదె శ్రీనివాసులునాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర్‌రావు, వివిధ సంఘాల ప్రతినిధులు శివకుమారి రెడ్డి, రవిచంద్, ఎస్.నాగేశ్వరరెడ్డి, ఎస్.ఎ.త్రినాథరావు, కె.ఎస్.రావు, బాగవతుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

పరవాడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమవారం నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈవో ఎం.దివాకర్‌రావు తెలిపారు. మొత్తం 993 మంది విద్యార్థులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. పెదముషిడివాడ హైస్కూల్, లంకెలపాలెం హైస్కూల్, పరవాడ ప్రభుత్వ బాలికల పాఠశాల, పరవాడ ప్రభుత్వ బాలుర పాఠశాల, వాడచీపురుపల్లి హైస్కూళ్లను పరీక్షా కేంద్రాలుగా పరీక్షలు జరుగుతాయని, 13 ప్రభుత్వ పాఠశాలలు, ఐదు ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరవుతారని చెప్పారు. విద్యార్థులు అరగంట ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను సమకూర్చినట్టు ఆయన తెలిపారు.

కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల దీక్షలు

అనకాపల్లి టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ ఎన్ఎంయూఏ కార్మికులు చేస్తున్న రిలే నిరాహారదీక్షలు ఆదివారం 16వ రోజు కొనసాగాయి. ఈ దీక్షల్లో ఎన్. ప్రసాద్, బీఆర్ రావు, ఎస్ఆర్ రావు, ఎస్‌జీ రాజు కూర్చున్నారు. ఎండీ ఆదేశాల ప్రకారం 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు.